




ఆర్ఎన్ఐ/2009/ 28733

స్థాపితం : 2003

# ఆంధ్రనాడు

తెలుగు దినపత్రిక

సంపుటి : 22 సంచిక: 45 తిరుపతి తేది : శుక్రవారం 15 మే 2026 పేజీలు : 08 ధర : రూ.6 PUBLISHED FROM TIRUPATI, CHITTOOR, ANNAMAIAH, ANANTHAPUR DISRICTS


# బ్రిక్స్‌కు సంకట స్థితి!

- కూటమి ఐక్యతకు ఇరాన్ సంక్షోభం భారీ పరీక్ష
- అమెరికా-ఇజ్రాయిల్ చర్యలను ఖండించే సంయుక్త ప్రకటన కోరుతున్న టెహ్రాన్
- ఇరాన్‌కు భిన్నంగా యూఏఈ వంటి దేశాల ప్రయోజనాలు
- న్యూఢిల్లీ సమావేశంలో సభ్య దేశాల విభిన్న వ్యూహాత్మక ప్రయోజనాలు బహిర్గతం
- ఏకాభిప్రాయం కష్టమేనంటున్న అంతర్జాతీయ నిపుణులు
- అధ్యక్ష బాధ్యతలు నిర్వహిస్తున్న భారత్‌కు పెద్ద సవాల్




**న్యూఢిల్లీ -ఆంధ్రనాడు, మే 14**

ఇరాన్ సంక్షోభం బ్రిక్స్ ఐక్యతకు ఒక భారీ పరీక్షగా నిలుస్తోంది. ఇరాన్‌పై కొనసాగుతున్న అమెరికా, ఇజ్రాయిల్ దుశ్చర్యల నేపథ్యంలో బ్రిక్స్ కూటమి ఇప్పటివరకు తప్పించుకుంటూ వచ్చిన కీలక రాజకీయ పరీక్షను ప్రస్తుతం ఎదుర్కొంటోంది. ఆర్థిక సహకార వేదికగా ప్రారంభమైన ఈ కూటమి ఇప్పుడు అంతర్జాతీయ రాజకీయ సంక్షోభాలపై ఏకాభిప్రాయంతో స్పందించగలదా అన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. న్యూఢిల్లీలో జరుగుతున్న బ్రిక్స్ దేశాల విదేశాంగ మంత్రుల సమావేశం ఈ అంతర్గత విభేదాలను బహిర్గతం చేసిందని విశ్లేషకులు చెప్తున్నారు. ఇరాన్-అమెరికా-ఇజ్రాయెల్

- మిగతా 2లో..

# ఢిల్లీలో మరో నిర్భయ

- కదులుతున్న బస్సులో మహిళపై సామూహిక లైంగికదాడి
- డ్రైవర్, కండక్టర్ అరెస్ట్ - దేశ రాజధానిలో మహిళలకు భద్రత కరువు : మహిళా సంఘాలు
- బీజేపీ ప్రభుత్వంలో ప్రజలకు రక్షణేది? : ఆప్

2లో





# ఏపీలో విస్తరణకు ఉబెర్ రెడీ...

- చంద్రబాబు, లోకేష్‌తో సంస్థ సీఈవో భేటీ
- ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీ అయిన ఉబెర్ గ్లోబల్ సీఈఓ దారా ఖోస్రోషాహి
- విశాఖపట్నంలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను విస్తరించనున్నట్లు వెల్లడి
- భారత్‌లోని కార్యకలాపాలకు ఏపీని టాలెంట్ హబ్‌గా గుర్తించిన ఉబెర్
- అమరావతి క్వాంటం టెక్నాలజీపై ఆసక్తి.. అధునాతన లాజిస్టిక్స్ కోసం వినియోగం
- టెక్నాలజీ, మొబిలిటీ, ఆవిష్కరణలపై మంత్రి లోకేష్‌తోనూ విస్తృత చర్చలు

2లో

# వారంలో ఒక రోజు 'నో వెహికిల్ డే'...

- ఏపీ క్యాబినెట్ భేటీలో కీలక నిర్ణయం
- "నా దేశం - నా బాధ్యత" పేరుతో ఏపీలో పొదుపు చర్యలు ప్రారంభించిన ప్రభుత్వం
- మంత్రులు, ఎమ్మెల్యేలు కాన్వాయ్‌లు, విదేశీ పర్యటనలు తగ్గించుకోవాలని సీఎం ఆదేశం
- సైకిళ్ల వాడకాన్ని ప్రోత్సహించాలని సూచన
- బంగారం కొనుగోళ్లు తగ్గించి, స్వదేశీ పర్యాటకాన్ని ప్రోత్సహించాలని ప్రజలకు విజ్ఞప్తి
- రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని, ప్రత్యామ్నాయాలపై దృష్టి పెట్టాలని పిలుపు
- ఇది భయపెట్టడానికి కాదు, సంక్షోభాన్ని ఎదుర్కొనే ముందుజాగ్రత్త చర్య అని స్పష్టీకరణ

**అమరావతి-ఆంధ్రనాడు, మే 14**



ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు, ఆర్థిక సంక్షోభాల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. "నా దేశం - నా బాధ్యత" అనే నినాదంతో రాష్ట్రవ్యాప్తంగా భారీ పొదుపు చర్యలకు శ్రీకారం చుట్టింది. ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు మంత్రి కొలుసు పార్థసారథి వెల్లడించారు. సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాబోయే క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొనేందుకు సమాజం సిద్ధంగా ఉండాలనే ఉద్దేశంతోనే ఈ ముందుజాగ్రత్త చర్యలు చేపడుతున్నామని స్పష్టం చేశారు. ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితుల వల్ల ఇంధన దిగుమతులు, విదేశీ మారక ద్రవ్యంపై తీవ్ర ఒత్తిడి పడుతోందని, వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులకు ఆటంకాలు ఏర్పడే ప్రమాదం ఉందని మంత్రి వివరించారు. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని,

- మిగతా 2లో..



# ఏపీ పీజీఈసెట్ ఫలితాలు విడుదల

- 9,990 మంది పరీక్షలు రాయగా 9,320 ఉత్తీర్ణులైనట్లు లోకేశ్ వెల్లడి
- ఉత్తీర్ణత శాతం 93.29 శాతంగా నమోదు
- అధికారిక వెబ్ సైట్‌లో అందుబాటులో ర్యాంకు కార్డులు
- వాట్సాప్ నెంబర్ 95523 00009 ద్వారా కూడా ఫలితాలు తెలుసుకోవచ్చు

**అమరావతి-ఆంధ్రనాడు, మే 14**

ఉన్నత విద్యా ప్రవేశాలకు నిర్వహించే ఏపీ పీజీఈసెట్-2026 ఫలితాలు విడుదలయ్యాయి. ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ సామాజిక మాధ్యమ వేదికల ద్వారా వీటిని విడుదల చేశారు. 9,990 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 9,320 మంది ఉత్తీర్ణత సాధించినట్లు వెల్లడించారు.

- మిగతా 2లో..

# 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ. 1.27 లక్షల కోట్ల ఆదాయం లక్ష్యం

- ఆదాయార్జన శాఖలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష
- గత ఏడాదితో పోలిస్తే 6 శాతం పెరిగిన రాష్ట్ర సొంత ఆదాయం
- లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలని అధికారులకు సీఎం ఆదేశం
- ప్రభుత్వ సొమ్ము సద్వినియోగం కావాలని స్పష్టం చేసిన ముఖ్యమంత్రి

**అమరావతి-ఆంధ్రనాడు, మే 14**



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే కీలక శాఖల పనితీరుపై ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతి సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను రూ. 1,27,506 కోట్ల ఆదాయాన్ని లక్ష్యంగా నిర్దేశిస్తూ, ఆ దిశగా పనిచేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో శాఖల వారీగా ప్రభుత్వానికి సమకూరుతున్న ఆదాయంపై అధికారులు ముఖ్యమంత్రికి వివరాలు అందించారు. రాష్ట్ర సొంత ఆదాయం (స్టేట్ ఓన్ రెవెన్యూస్) 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ. 1,04,345 కోట్లుగా ఉండగా, 2025-26 నాటికి అది రూ. 1,10,643 కోట్లకు చేరినట్లు తెలిపారు. తద్వారా గత ఏడాదితో పోలిస్తే 6 శాతం వృద్ధి నమోదైనట్లు వివరించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో జీఎస్టీ ద్వారా రూ. 33,679 కోట్లు, గనుల శాఖ నుంచి రూ. 10,300 కోట్లు, స్టాంపులు-రిజిస్ట్రేషన్ల ద్వారా రూ. 11,047 కోట్ల ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో, నిర్దేశించిన లక్ష్యాలకు

- మిగతా 2లో..



# ఆసుపత్రికి తాళం...

- రాత్రి జబ్బు చేస్తే తిరుపతి దిక్కు
- రాత్రి 8 తర్వాత దిక్కెవరు ఉండరు.
- దామినేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పై పర్యవేక్షణ కరువు
- కూత వేటు దూరంలోనే కలెక్టర్ కార్యాలయం
- ముగ్గురు డాక్టర్లు ఉన్నా రాత్రి సమయంలో ఉండరు
- ఆస్పత్రి మూసేస్తారు
- పేరుకే 24 గంటల ఆసుపత్రి
- కలెక్టర్ కార్యాలయానికి కూత వేటు దూరం

**ఆంధ్రనాడు, ప్రత్యేక ప్రతినిధి తిరుపతి, మే 14, పీహెచ్సీ**

తిరుపతి దామినేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చుట్టూ ఉన్న పేదవారు రెక్కాడితే గాని.. డొక్కా ఆడదు.. ప్రభుత్వ అధికారులు ప్రభుత్వం పేదవారి కోసం ఏర్పాటుచేసిన ఆసుపత్రి తూతూ మంత్రంగా వైద్యం అందుతున్నదన్న విమర్శలు విపిస్తున్నాయి. జనానికి వైద్య సేవలు అందించాల్సిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పిహెచ్సి) రాత్రి 8 గంటలు దాటితే ఆసుపత్రికి తాళం వేయడం జరుగుతుంది. అత్యవసరం అయితే వైద్యం కోసం వస్తే అక్కడ తాళం వేసి ఉంటుంది. వైద్యం కోసం వచ్చిన పేదవాళ్లు రాత్రి వేళలో 24 గంటలు

- మిగతా 2లో..

# ఏపీలో విస్తరణకు ఉబెర్ రెడీ...

**అమరావతి-ఆంధ్రనాడు, మే 14**

ప్రముఖ రైడ్–హెయిలింగ్ సంస్థ ఉబెర్, ఆంధ్రప్రదేశ్‌లో తమ కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు ప్రణాళికలు రచిస్తోంది. ఈ మేరకు ఉబెర్ గ్లోబల్ సీఈఓ దారా ఖోస్రోషాహి నేతృత్వంలోని ఉన్నతస్థాయి బృందం, ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశమైంది. ఈ భేటీలో రాష్ట్రంలో పెట్టుబడులు, విస్తరణ అవకాశాలపై ఫలప్రదమైన చర్చలు జరిగాయి. సమావేశం అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందిస్తూ.. విశాఖ పట్నంలోని తమ 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'ను విస్తరించాలని ఉబెర్ యోచిస్తోందని తెలిపారు. దేశవ్యాప్తంగా తమ కార్యకలాపాలకు అవసరమైన నైపుణ్యాల కోసం ఆంధ్ర ప్రదేశ్‌ను ఒక బలమైన టాలెంట్ హబ్‌గా ఉబెర్ పరిగణించడం సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా, అమరావతిలో అభివృద్ధి చెందుతున్న క్వాంటం టెక్నాలజీస్ ఎకోసిస్టమ్‌పై ఉబెర్ ఆసక్తి కనబరిచినట్లు సీఎం వెల్లడించారు. ఈ సాంకేతికతను ఉపయోగించుకుని అధునాతన లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ అల్గారిథమ్‌లను అభివృద్ధి చేయాలని కంపెనీ భావిస్తున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో పాల్గొన్న మంత్రి నారా లోకేష్ కూడా స్పందించారు. ఉబెర్ గ్లోబల్ లీడర్‌షిప్ బృందంతో జరిగిన విందు సమావేశంలో టెక్నాలజీ, మొబిలిటీ, ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధి, పట్టణ రవాణా భవిష్యత్తు వంటి అనేక అంశాలపై విస్తృతంగా చర్చించినట్లు ఆయన తెలిపారు. భవిష్యత్తును తీర్చిదిద్దే గ్లోబల్ లీడర్లతో ఆలోచనలు పంచుకోవడం ఎంతో విలువైనదని లోకేష్ పేర్కొన్నారు. ఈ భేటీతో ఏపీలో టెక్నాలజీ ఆధారిత అభివృద్ధికి మరింత ఊతం లభించనుందని నిపుణులు భావిస్తున్నారు.

# ఏపీ పీజీఈసెట్ ఫలితాలు విడుదల

(మొదటి పేజీ తరువాయి)

ఉత్తీర్ణత శాతం 93.29 శాతంగా ఉంది. ర్యాంకు కార్డులు అధికారిక వెబ్ సైట్ https://cets.apsche.ap.gov.in/PGECET/PGECET/PGECET_HomePage.aspxలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రిజిస్ట్రేషన్ నెంబర్, హాల్ టిక్కెట్ నెంబర్‌లను ఎంటర్ చేసి ఫలితాలు తెలుసు కోవచ్చు. ఈ పోర్టల్ నుంచి ఫలితాలను డౌన్ లోడ్ చేసుకోవచ్చు. వాట్సాప్ నెంబర్ 9552300009 ద్వారా కూడా ఫలితాలు తెలుసుకోవచ్చని సూచించారు. ఏపీ పీజీఈసెట్–2026లో అర్హత సాధించిన విద్యార్థులకు మంత్రి లోకేశ్ అభినందనలు తెలియజేశారు.

# 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ. 1.27 లక్షల కోట్ల ఆదాయం లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

అనుగుణంగా గనులు, ఎక్సైజ్, వాణిజ్య పన్నులు, రవాణా, స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖలు పనిచేయాలని చంద్రబాబు ఆదేశించారు. ప్రభుత్వ ఆదాయంలో ప్రతీ రూపాయి ప్రజలకు సద్వినియోగం కావాలని, ఆ దిశగా అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని ఆయన స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌తో పాటు ఆర్థిక, రవాణా, ఎక్సైజ్, గనులు, స్టాంపులు–రిజిస్ట్రేషన్, వాణిజ్య పన్నులు, అటవీ, పురపాలక శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఆసుపత్రికి తాళం...

(మొదటి పేజీ తరువాయి)

ఉంటుందని అత్యవసర వైద్యానికే ప్రజలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వస్తూ ఉంటారు. ఆ సమయంలో ప్రాథమిక వైద్యం చాలా ముఖ్యం కానీ ప్రస్తుతం ఆసుపత్రి ఆ పరిస్థితి కనిపించడం లేదు.

**పేరుకేనా 24 గంటలు ఆసుపత్రి...**

దామి నేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కలెక్టర్ కార్యాలయానికి కూత వేటు దూరంలో ఉంది. దానికి తోడు ఆ ప్రాంతంలో 150 బైపాస్ రోడ్డు ఉండడంతో అప్పుడప్పుడు రోడ్డు ప్రమాదాలు కూడా జరుగుతూ ఉంటాయి. కనీసం ప్రాథమిక వైద్యం కోసం అక్కడకి వస్తే ఆసుపత్రి తాళం వేసి ఉండడం తో పేదవారు వైద్యం కోసం వచ్చి తిరిగి వైద్యం కోసం తిరుపతికి వెళ్లాల్సి వస్తోంది.

**పేరుకే ముగ్గురు డాక్టర్లు..** దామినేడు 24 గంటల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ముగ్గురు డాక్టర్లును ఏర్పాటు చేశారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు 24 గంటలు ఆసుపత్రిని ఏర్పాటు చేశా రు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు డాక్టర్లు మాత్రమే అన్నిచోట్ల ఉంటే. ప్రత్యేకం గా దామినేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి మాత్రం ముగ్గురు డాక్టర్లను ఏర్పాటు చేశారు. కనీసం ఆసుపత్రి ఉందని కూడా సమీప ప్రాంతంలో ఎక్కడ కూడా బోర్డులు ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు. ఆసుపత్రికి కేటాయించిన నిధులు ఏమవుతున్నాయో అర్థం కాని పరిస్థితిని .

**ఆసుపత్రి తీరు మారిపోతే.. ఆందోళన తప్పదు..**

24 గంటలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అందుబాటులో ఉండకపోతే ఆందోళన చేస్తామని స్థానిక ప్రజలు హెచ్చరిస్తున్నారు. పేదవారి కోసం వైద్యశాలను ఏర్పాటు చేస్తే వైద్య అధికారులు ఏదైనా అడిగితే దాట వేసే సమాధానం చెబుతూ మీకు దిక్కున చోట చెప్పుకోండి అని అంటున్నారని ఆందోళన తప్పదని హెచ్చరిస్తున్నారు.

**ఆసుపత్రి తీరు మారేది ఎన్నడూ...**

దామినేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఒకటి ఉందని ఆ ప్రాంత ప్రజలకు ఎవరు కానీ తెలియని పరిస్థితి ఏదైనా వైద్యం కావాలంటే ఆర్.ఎం.పీ. డాక్టర్లను, పీ.ఎం.పీల దగ్గరికి వెళ్లి పరిస్థితి వస్తుందని వాపోయారు. ఇకనైనా జిల్లా కలెక్టర్ , జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆసుపత్రిని సందర్శించి ఆసుపత్రికి తీరును మెరుగుపరచాలని ప్రజలకు కోరుతున్నారు.

# బ్రిక్స్‌కు సంకట స్థితి!

(మొదటి పేజీ తరువాయి)

ఉద్రిక్తతల ప్రభావం సమావేశంపై స్పష్టంగా కనిపిస్తోంది. బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా వంటి పాత సభ్యులతో పాటు ఇరాన్, ఈజిప్ట్, ఇథియోపియా, ఇండోనేషియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) వంటి కొత్త సభ్య దేశాలు కూడా చర్చల్లో పాల్గొంటున్నాయి. అధికారికంగా 'గ్లోబల్ సౌత్' ఆర్థిక సహకారమే ప్రధాన అంశమని ప్రకటించినప్పటికీ, వాస్తవానికి ఇరాన్ సంక్షోభమే చర్చల కేంద్రబిందు వైందని అంతర్జాతీయ నిపుణులు, విశ్లేషకులు చెప్తున్నారు.

**అమెరికా–ఇజ్రాయిల్ చర్యల ఖండనపై ఏకగ్రీవ ప్రకటన కోరుతోన్న ఇరాన్**

ఈ సమావేశానికి వచ్చిన ఇరాన్ ప్రధాన లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. గల్ఫ్ ఘర్షణలో అమెరికా, ఇజ్రాయెల్ చర్యలను ఖండిస్తూ బ్రిక్స్ నుంచి ఏకగ్రీవ ప్రకటన వెలువడాలని టెహ్రాన్ కోరుతోంది. పాశ్చాత్య ఆధిపత్యానికి ప్రత్యామ్నాయ శక్తిగా బ్రిక్స్‌ను చూపించాలని ఇరాన్ ప్రయత్నిస్తోంది. అంతర్జాతీయ వేదికల్లో తన ఒంటరితనాన్ని తగ్గించుకోవడమే కాకుండా, ప్రపంచ రాజకీయాల్లో శక్తి సమీకరణాలు మారుతున్నాయనే సందేశాన్ని ఇవ్వాలనుకుంటోంది. అయితే ఇరాన్ ఆశలు బ్రిక్స్ అంతర్గత వాస్తవాలకు భిన్నంగా ఉన్నాయి. ఎందుకంటే ప్రస్తుతం ఈ కూటమి ఒకే విధమైన వ్యూహాత్మక ప్రయోజనాలు కలిగిన దేశాల సమూహం కాదని విశ్లేషకులు గుర్తుచేస్తున్నారు. పరస్పర విభిన్న రాజకీయ, భద్రతా, ఆర్థిక ప్రయో జనాలు కలిగిన దేశాల కలయికగా బ్రిక్స్‌మారిందని చెప్తున్నారు.

**కూటమిలో కీలకంగా మారిన యూఏఈ–ఇరాన్ సంబంధాలు**

బ్రిక్స్‌లో కొనసాగుతున్న సంకటస్థితి, విభేదాలకు స్పష్టమైన ఉదాహరణ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ), ఇరాన్ మధ్య సంబంధాలు. ఇరాన్... బ్రిక్స్ నుంచి బలమైన అమెరికా–ఇజ్రాయెల్ వ్యతిరేక ప్రకటన కోరుతుండగా, యూఏఈ మాత్రం గల్ఫ్ ప్రాంతంలో పూర్తిగా భిన్న వ్యూహాత్మక స్థితిలో ఉంది. ఒకే కూటమిలో భిన్న ప్రయోజనాలు కలిగిన ఈ రెండు దేశాలు ఉండటం బ్రిక్స్ ఎదుర్కొంటున్న రాజకీయ సమన్వయ పరిమితులను బయటపెడుతోందని విశ్లేషకులు వివరిస్తున్నారు.

**భారత్‌కు పెద్ద సవాల్**

ఈ పరిస్థితుల్లో అందరికీ ఆమోదయోగ్యమైన సంయుక్త ప్రకటన తయారు చేయడం భారత్‌కు పెద్ద సవాలుగా మారింది. 2026లో బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలు నిర్వహిస్తున్న భారత్.. కూటమిలో ఐక్యతను ప్రదర్శించాలనుకుంటూనే, ఇరాన్, గల్ఫ్ దేశాలు, పాశ్చాత్య శక్తులతో తన వ్యూహాత్మక సంబంధాలను కూడా కాపాడుకోవాల్సిన పరిస్థితిలో ఉంది. తుది ప్రకటన కోసం ప్రయత్నాలు కొనసాగుతున్నప్పటికీ, అందరికీ ఆమోద యోగ్యమైన 'తటస్థ భాష' రూపొందించడం కష్టమని భారత అధికారులు అంతర్గతంగా అంగీకరిస్తున్నట్టు సమాచారం. ప్రస్తుతం భారత్ అత్యంత సున్నితమైన సమతుల్య రాజకీయాన్ని అనుసరిస్తోందని విశ్లేషకులు వివరిస్తున్నారు. అదే సమయంలో బ్రిక్స్‌లో నాయకత్వాన్ని ప్రదర్శిస్తూ... కూటమి బహిరంగంగా చీలిపోకుండా చూడాల్సిన బాధ్యత కూడా భారత్‌పైనే ఉందని వారు అంటున్నారు.

**పాశ్చాత్య దేశాలకు సందేశం పంపాలని భావిస్తున్న రష్యా**

రష్యా మాత్రం ఈ సమావేశాన్ని వేరే కోణంలో చూస్తోంది. పాశ్చాత్య దేశాల ఆంక్షల తరువాత మాస్కో బ్రిక్స్‌ను బహుళ ధృవ ప్రపంచ వ్యవస్థకు కీలక వేదికగా ప్రోత్సహిస్తోంది. రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ స్వయంగా హాజరుకావడం ద్వారా, పాశ్చాత్య దేశాలు రష్యాను అంతర్జాతీయంగా ఒంటరిచేయాలన్న ప్రయత్నాలు విఫలమయ్యాయని చూపించాలని మాస్కో భావిస్తోందని అంతర్జాతీయ విశ్లేషకులు చెప్తున్నారు.

**సమతుల్యతను పాటిస్తున్న చైనా**

చైనా పాత్ర కూడా ప్రత్యేకంగా చర్చకు వచ్చింది. చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ సమావేశానికి హాజరు కాలేదు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ బీజింగ్ పర్యటన కారణంగా షెడ్యూల్ సమస్యలు ఏర్పడటంతో ఆయన రాలేకపోయారు.ఇందులో చైనా రాయబారి మాత్రమే పాల్గొన్నారు. ఈ పరిణామం కీలక చర్చల సమయంలో బీజింగ్ ప్రత్యక్ష ప్రభావాన్ని కాస్త తగ్గించిందని విశ్లేషకులు చెప్తున్నారు. చైనా ఒకవైపు ఇరాన్‌తో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తూనే, మరోవైపు గల్ఫ్ అరబ్ దేశాలతో ఆర్థిక సంబంధాలను కూడా సమతుల్యం చేస్తోందని వివరిస్తున్నారు.

**బ్రిక్స్ విస్తరణతో పెరిగిన సమస్యలు!**

బ్రిక్స్ విస్తరణతో సమస్యలు మరింత పెరిగాయని విశ్లేషకులు చెప్తున్నారు. కొత్త సభ్య దేశాల చేరికతో కూటమి ప్రపంచవ్యాప్త ప్రాధాన్యం పెరిగినా, అంతర్గత విభేదాలు కూడా విస్తరించాయని అంటున్నారు. ఆర్థిక వేదికగా ప్రారంభమైన ఈ కూటమి ఇప్పుడు భౌగోళిక రాజకీయ వేదికగా మారాలని ప్రయత్నిస్తుండగా, ఇరాన్ సంక్షోభం ఆ మార్పు ఎంత క్లిష్టమో చూపిస్తోందని చెప్తున్నారు. గల్ఫ్ ఉద్రిక్తతలు ఇంధన మార్కెట్లపై ప్రభావం చూపుతున్నాయి. భారత్, ఈజిప్ట్, ఇండోనేషియా వంటి దేశాలకు పెరుగుతున్న చమురు ధరలు ద్రవ్యోల్బణం, ఆర్థిక ఒత్తిడికి దారితీస్తున్నాయి. కొన్ని సభ్య దేశాలు ఇప్పటికే సబ్సిడీలు, వ్యూహాత్మక నిల్వల వినియోగం, ధర నియంత్రణ చర్యలు చేపట్టినా, ఇవి తాత్కాలిక పరిష్కారాలేనని నిపుణులు అంటున్నారు.

**న్యూఢిల్లీ సమావేశంతో కీలక విషయం బహిర్గతం**

ఇక న్యూఢిల్లీ సమావేశం చివరికి ఒక సంయుక్త ప్రకటన వెలువడే అవకాశం ఉన్నప్పటికీ... అది బలహీనమైన, జాగ్రత్తగా రూపొందించిన భాషతో ఉండవచ్చని నిపుణులు భావిస్తున్నారు. అయితే ఈ సమావేశం ఇప్పటికే ఒక పెద్ద వాస్తవాన్ని బయటపెట్టిందని చెప్తున్నారు.

ఇక బ్రిక్స్ కేవలం పాశ్చాత్య ఆర్థిక వ్యవస్థలకు ప్రత్యామ్నాయ వేదిక మాత్రమే కాదనీ, పరస్పర విభిన్న ప్రయోజనాలున్న దేశాలు నిజమైన అంతర్జాతీయ సంక్షోభాల నడుమ రాజకీయ సమన్వయం సాధించగలవా అన్న పరీక్షను ఎదుర్కొంటున్న కూటమిగా మారిందని అంతర్జా తీయ విశ్లేషకులు, నిపుణులు అంటున్నారు.

# వారంలో ఒక రోజు 'నో వెహికిల్ డే...

(మొదటి పేజీ తరువాయి)

పొదుపు చర్యలు పాటించడం ద్వారా దేశానికి మేలు చేయాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చినట్లు తెలిపారు.

**ప్రజాప్రతినిధుల నుంచే మార్పు మొదలవ్వాలి..**

ఈ పొదుపు చర్యలు తొలుత ప్రజాప్రతినిధులు, అధికారుల నుంచే ప్రారంభం కావాలని ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని పార్థసారథి తెలిపారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు తమ కాన్వాయ్‌లలో వాహనాల సంఖ్యను గణనీయంగా తగ్గించుకోవాలని సూచించారు. అనవసర విదేశీ పర్యటనలను పూర్తిగా రద్దు చేసుకోవాలన్నారు. వీలైతే ప్రజా రవాణా వ్యవస్థను ఉపయోగించుకోవాలని, సమీప ప్రాంతాలకు వెళ్లేటప్పుడు కార్లకు బదులుగా నడక లేదా సైకిల్‌ను ఆశ్రయించాలని సీఎం కోరారు. వారానికి ఒక రోజు (శుక్రవారం) 'నో వెహికల్ డే' పాటించాలని, ఆ రోజు వాహనాలు వినియోగించకుండా వర్చువల్ విధానంలో సమావేశాలు నిర్వహించుకోవాలని సూచించారు. అధికారులు కూడా వాహనాలను షేర్ చేసుకోవడం ద్వారా ఇంధనాన్ని ఆదా చేయాలని కోరారు. ప్రభుత్వ శాఖల్లో ఇంధన వినియోగంపై వారానికోసారి సమీక్షించాలని, కొత్తగా కొనుగోలు చేసే వాహనాలు ఎలక్ట్రిక్ (ఈవీ) వాహనాలే అయి ఉండాలని క్యాబినెట్ నిర్ణయించింది.

**ప్రజలకు, రైతులకు కీలక విజ్ఞప్తులు**

ప్రజలు కూడా ఈ సంక్షోభ సమయంలో బాధ్యతగా వ్యవహరించాలని మంత్రి కోరారు. విహారయాత్రల కోసం విదేశాలకు వెళ్లే బదులు స్వదేశీ పర్యాటకాన్ని ప్రోత్సహించాలని సూచించారు. బంగారం కొనుగోళ్లపై మోజు తగ్గించుకోవాలని, దీనివల్ల ఏటా వేల కోట్ల డాలర్ల విదేశీ మారక ద్రవ్యం ఆదా అవుతుందని అన్నారు. "స్టెప్ ఫర్ ది నేషన్" పేరుతో నడక, సైకిల్ వాడకాన్ని ప్రోత్సహించేందుకు ప్రచార కార్యక్రమాలు చేపడతామన్నారు. ప్రస్తుత పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. ముఖ్యంగా ఇంధన, వ్యవసాయ రంగాల్లో కీలక మార్పులకు శ్రీకారం చుట్టాలని సీఎం ఆదేశించారన్నారు. శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు 'పీఎం సూర్యఘర్', 'కుసుమ్' వంటి సౌర విద్యుత్ పథకాలను మరింత వేగవంతం చేయాలని ఇంధన శాఖను ఆదేశించినట్లు చెప్పారు. ప్రస్తుతం లక్షల మందికి మాత్రమే చేరిన ఈ పథకాలను విస్తృతం చేసేందుకు అవసరమైన పరికరాల తయారీదారులతో, సప్లై చైన్‌తో చర్చలు జరపాలని సూచించారన్నారు. అలాగే, కంప్రెస్డ్ బయోగ్యాస్ (సీబీజీ) వంటి ప్రత్యామ్నాయ ఇంధన ప్లాంట్ల ఏర్పాటుకు భవిష్యత్ ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారన్నారు. వ్యవసాయ రంగంలో రసాయనిక ఎరువుల వాడకం విపరీతంగా పెరిగిపోయిందని, ముఖ్యంగా యూరియా వినియోగంలో రైతుల మధ్య చాలా వ్యత్యాసం ఉందని పార్థసారథి ఆందోళన వ్యక్తం చేశారు. కొందరు రైతులు ఎకరానికి రెండు బస్తాలు వాడుతుంటే, మరికొందరు మూడు, నాలుగు బస్తాలు వాడుతున్నారని, ఇది శాస్త్రీయంగా సరైంది కాదన్నారు. అధిక దిగుబడి కోసం కెమికల్స్ వాడకం వల్ల భూసారం దెబ్బతింటోందని, దీన్ని తగ్గించేలా రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖకు సీఎం సూచించారని తెలిపారు. దీనికి ప్రత్యామ్నాయంగా వచ్చిన 'నానో యూరియా' వాడకాన్ని ప్రోత్సహించాలని కోరారు. డ్రోన్ల సహాయంతో నానో యూరియాను పొలం అంతటా సమానంగా చల్లడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని, రైతులు ఈ దిశగా ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు.

**ముందు జాగ్రత్తే కానీ, భయం వద్దు**

ఈ చర్యలన్నీ ప్రజలను భయపెట్టడానికి కాదని, కేవలం సంభావ్య సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి సమాజాన్ని సన్నద్ధం చేయడానికేనని మంత్రి పార్థసారథి స్పష్టం చేశారు. "రాబోయే ప్రమాదాన్ని ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలి తప్ప, ఆదాయం తగ్గిపోతుందని ఆలోచించకూడదు. దేశ ప్రయోజనాలే ముఖ్యం" అని ఆయన పేర్కొన్నారు. ఇంధన పొదుపు వల్ల రాష్ట్రానికి వచ్చే పన్ను ఆదాయం తగ్గవచ్చనే ప్రశ్నకు ఆయన ఈ విధంగా సమాధానమిచ్చారు. ప్రభుత్వం ఇతర మార్గాల్లో ఆదాయాన్ని పెంచుకోవడానికి ప్రయత్నిస్తోందని, త్వరలోనే రాష్ట్రానికి రూ. 1.5 లక్షల కోట్ల భారీ పెట్టుబడులు రాబోతున్నాయని తెలిపారు. ఈ పొదుపు చర్యలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఐఅండ్‌పీఆర్ శాఖ ద్వారా విస్తృత ప్రచారం నిర్వహిస్తామని మంత్రి కొలుసు పార్థసారథి వివరించారు.

# ఢిల్లీలో మరో నిర్భయ

**- కదులుతున్న బస్సులో మహిళపై సామూహిక లైంగికదాడి**
**- డ్రైవర్, కండక్టర్ అరెస్ట్**
**- దేశ రాజధానిలో మహిళలకు భద్రత కరువు : మహిళా సంఘాలు**
**- బీజేపీ ప్రభుత్వంలో ప్రజలకు రక్షణేది? : ఆప్**

**న్యూఢిల్లీ -ఆంధ్రనాడు, మే 14**

దేశ రాజధాని ఢిల్లీలో నిర్భయ తరహా ఘోరం వెలుగు చూసింది. కదులుతున్న ప్రయివేటు బస్సులో మహిళపై డ్రైవర్, కండక్టర్ సామూహిక లైంగికదాడికి తెగబడ్డారు. మే 12 (సోమవారం)న జరిగిన ఈ ఘటన బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా వెలుగులో వచ్చింది. బస్సు డ్రైవర్, కండక్టర్‌ను అరెస్ట్ చేసినట్టు పోలీసు వర్గాలు గురు వారం వెల్లడించాయి. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మహిళకు రక్షణ కరువుతుంటే..దేశ రాజధానిలో ఇలాంటి కిరా తకాలు జరగటం పట్ల మహిళా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. నిర్భయ తరహా ఘటన పునరావృ త మైందని సీఎం రేఖాగుప్తా ప్రభుత్వంపై ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) తీవ్ర విమర్శలు చేసింది. బీజేపీ ప్రభుత్వంలో ప్రజ లకు భద్రత లేకుండా పోయిందని ఆగ్రహాన్ని వెలిబుచ్చింది.

**ఏం జరిగింది..?**

ఢిల్లీ పోలీసు వర్గాలు తెలిపిన వివరాలు ప్రకారం ఈ ఘటన సోమవారం అర్ధరాత్రి సమయంలో జరిగింది. పితాంపురా మురికి వాడ ప్రాంతంలో నివసిస్తున్న బాధితురాలు మంగోల్‌పురిలోని ఓ ఫ్యాక్టరీలో పనిచేస్తోంది. విధులు ముగించుకుని ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా రాణిబాగ్ ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. సరస్వతి విహార్‌లోని బీ–బ్లాక్ బస్టాండ్‌కు చేరుకున్న సమయంలో ఓ స్లీపర్ బస్సు అక్కడ ఆగింది. బస్సు తలుపు వద్ద నిలబడి ఉన్న వ్యక్తిని సమయం ఎం తైందని మహిళ అడిగింది. అయితే ఆ మహిళను ఆ వ్యక్తి బలవంతంగా బస్సులోకి లాగినట్టు పోలీసులు తెలిపారు.

**రెండు గంటల పాటు బస్సులోనే దారుణం**

ఆమెను లోపలికి లాగిన వెంటనే బస్సు తలుపులు మూసివేశారని బాధితురాలు ఫిర్యా దులో పేర్కొంది. అనంతరం బస్సు నాంగ్లోయ్ మెట్రో స్టేషన్ సమీపంలో దాదాపు 7 కిలోమీటర్ల పరిధిలో రెండు గంటల పాటు తిరిగిందని వివరించింది. ఈ సమయంలో డ్రైవర్, కండక్టర్ కలిసి ఆమెపై లైంగికదాడికి పాల్పడినట్టు ఆరోపణలు ఉన్నాయి. బస్సులో కర్టెన్లు ఉండటంతో బయటివారికి లోపల ఏమి జరుగుతోందో కనిపించలేదని పోలీసులు తెలిపారు. రాత్రి సుమారు 2 గంటల సమయంలో నిందితులు గాయాలపాలైన మహిళను బస్సు నుంచి బయటకు తోసేసి అక్కడి నుంచి పరారైనట్టు బాధితురాలు వివరించింది. అనంతరం ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది.

**బీహార్ రిజిస్ట్రేషన్ ఉన్న బస్సు స్వాధీనం**

బాధితురాలి ఫిర్యాదు ఆధారంగా రాణిబాగ్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. నిందితులపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 64(1) (లైంగికదాడి), 70(1) (సామూహిక లైంగికదాడి), 3(5) (ఉమ్మడి ఉద్దేశం) కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్టు పోలీసు వర్గాలు తెలిపాయి. ఉమేశ్, రాజేంద్రగా గుర్తించిన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి జైలుకు తరలించినట్టు వెల్లడించాయి. నేరానికి ఉపయోగించిన బీహార్ రిజిస్ట్రేషన్ నంబర్ ఉన్న బస్సును స్వాధీనం చేసుకుని ఫోరెన్సిక్ పరీక్షల కోసం పంపించినట్టు తెలిపాయి. ఈ కేసును అన్ని




కోణాల్లో విచారిస్తున్నట్టు ఢిల్లీ పోలీసులు చెప్పారు. అలాగే బాధితురాలికి వైద్య పరీక్షలు నిర్వహించినట్టు అధికారులు వెల్లడించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా ఆస్పత్రిలో చేరాలని వైద్యులు సూచించినప్పటికీ బాధితురాలు నిరాకరించినట్టు వెల్లడించారు. తన భర్త క్షయవ్యాధితో బాధపడుతున్నారని, పిల్లలను చూసుకోవాల్సిన బాధ్యత ఉందని ఆమె పోలీసులకు చెప్పినట్టు సమాచారం. అందువల్ల ఇంటి వద్ద నుంచే చికిత్స కొనసాగించేందుకు నిర్ణయించుకు న్నట్టు తెలిసింది.

**మళ్లీ నిర్భయ ఘటన**

ఈ ఘటనపై ప్రతిపక్ష? ఆప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది దేశానికి పెద్ద అవమానం అంటూ బీజేపీపై ఆప్ అధ్యక్షుడు సౌరభ్ భరద్వాజ్ విమర్శలు గుప్పించారు. "పెద్ద అవమానం. నిర్భయ ఘటన మళ్లీ జరిగింది. 30 ఏండ్ల మహిళను రాత్రి సమయంలో బస్సులోకి ఎక్కించి దారుణానికి పాల్పడ్డారు" అని సౌరభ్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

## అన్నమయ్య పీఠం జానపద కళల పరిరక్షణ పరిషత్

### - నూతన మండల కమిటీ ఏర్పాటు







**పుంగనూరు – ఆంధ్రనాడు, మే 14 :** ఈ కమిటీలు అన్నమయ్య పీఠం జానపద కలల పరిరక్షణ జాతీయ అధ్యక్షుడు చెన్నం శ్రీరాములు ఆధ్వర్యంలో నిర్వహించారు, ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్నమయ్య పీఠం జానపద కళల పరిషత్ పుంగనూరు మండలం నూతన కమిటీ ప్రకటించడం జరిగింది పుంగనూరు మండల ఉపాధ్యక్షు డిగా సి రామానుజులు, మండల కన్వీనర్‌గా బి గణేష్, మహిళ విభాగ మండల కార్య దర్శి బి సావిత్రమ్మ, మండల ఉపాధ్యక్షులుగా బి మునిలక్ష్మమ్మ, మండల మహిళా వి భాగం కన్వీనర్ రత్నమ్మలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు మా ఈ అన్న మయ్య పీఠం జానపద కళల పరిషత్ సంస్థ ద్వారా, జానపద, చెక్కల భజన, కోలా టం, పిల్లన గ్రోవుల నైపుణ్యం గల కళాకారులు తయారు చేయడం జరిగిందన్నారు.

## బొమ్మలకుంటలో తాగునీటి సమస్య పరిష్కారం



**పెద్దపంజాణి, ఆంధ్రనాడు, మే 14 :** మండలంలోని బొమ్మలకుంటలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారమైనట్లు ఎంపీడీవో బాలాజీ తెలిపారు. గ్రామంలో మంచినీటి సమస్య ఎవరూ పట్టించుకవడం లేదని బుధవారం మండలంలోని బొమ్మలకుంటకు చెందిన మహిళలు స్థానిక మండల పరిషత్ కార్యాలయం మందు ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ విషయం పైన గురువారం పత్రికల్లో వార్త వినబడడంతో అధికారులు స్పందించారు.. ఈ సందర్భంగా బోరుకు కొత్తమోటర్ అమర్చి గ్రామానికి తాగునీటిని సరఫరా చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో బాలాజీ, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ హేమలత, పంచాయతీ కార్యదర్శు లత బోరును పరిశీలించారు.

## రేపు వైభవంగా శనీశ్వరుని జయంతి వేడుకలు



**రామచంద్రాపురం – ఆంధ్రనాడు, మే 14:** రామచంద్రాపు రం మండలం, రా యల చెరువు పంచాయతీ పరిదిలోని చా యాపురంలో వెలిసి వున్న శ్రీ ఛా యామార్తాండ శనీశ్వరా లయంలో శని జయంతి వేడుకలను వైభవంగా నిర్వ హించ నున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు ఉంగరాల సుబ్రహ్మణ్యంశర్మ చెప్పారు. 16 వ తేది శనివారం వైశాఖ బహుళ అమావాస్య రోజున శ్రీ శనీశ్వరస్వామి వారి జయంతి సందర్భంగా స్వా మివారిని వేకువ జామున సుప్రభాతం సేవతో మేల్కొల్పి. అ నంతరం ఉదయం ఏడు గంటలకు స్వామివారికి నిత్య పూజ లు ప్రారంభిస్తారు. అనంతరం శని భగవానునికి అత్యంత ప్రీ తికరమైన నువ్వుల నూనెతో తైలాభిషేకం చేస్తారు. తదుపరి పాలు పెరుగు నెయ్యి పంచామృతంతో కూడిన సుగంధ ద్ర వ్యాలతో ప్రత్యేక అభిషేకం నిర్వహించను న్నారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఆలయ ధర్మాధికారి ఉంగరాల సుబ్రహ్మణ్యం శర్మ శాస్త్రోక్తంగా శని నివారణ, శాంతి హోమం,గణపతి హోమం, నవగ్రహ శాంతి హోమం చేస్తారు. ఆలయ ప్రాంగణంలో పూజలందుకుంటున్న అభయ హస్త ఆంజనేయస్వామికి తమలపాకలతో ప్రత్యేక పూజలు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించనున్నారు. ఆలయ ధర్మాధికారి సుబ్రహ్మణ్యం శర్మ మాట్లాడుతూ సర్వ దోషాలు నివారణ అయ్యేవిధంగా భక్తులచే గోపూజ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. శనీశ్వర స్వామివారి జయంతి రోజున శని ప్రభావం కలిగి ఉన్న భక్తులు అష్టమ శని, అర్ధాష్టమ శని, ఏనాటి శని, శాంతి హోమం, నవగ్రహ దోష నివారణ హోమం, గణపతి హోమం, చండీ హోమం వారి వారి గ్రహ స్థితులను అనుసరించి ప్రతి శనివారం ప్రత్యేక పూజలు చేస్తామని వివరించారు .స్వామివారికి అత్యంత వైభవంగా ప్రాకారోత్సవం చేస్తామన్నారు. ముఖ్యంగా శ్రీ శనీశ్వర స్వామి వారికి 19 ప్రదక్షిణలు అత్యంత ప్రీతికరమని, శని దశ 19 సంవత్సరాలు జీవిత కాలంలో ఉంటుందని, ఆ సమయంలో మనం చేసే ప్రతి కార్యము పుణ్యదాయకమై ఉండాలని, కర్మఫల దాత శనీశ్వరుని అత్యంత పుణ్యకాలమని తెలిపారు. ఆలయానికి విచ్చేసిన భక్తులందరికీ అన్నదాన వితరణ చేయనున్నట్లు చెప్పారు.శని జయంతి రోజున స్వామివారి పూజలో పాల్గొని భక్తులందరూ స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

## వ్యవసాయ యంత్రాలకు దరఖాస్తు చేసుకోండి

పెద్దపంజాణి, ఆంధ్రనాడు, మే 14 : వ్యవసాయ యంత్రాల కొరకు ఆసక్తి ఉన్న రైతులు ఈ నెల 19 లోపు దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ అధికారి హేమలత ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం వ్యవసాయ యంత్రాల కొనుగోలుపై 40-50% రాయితీ ఇస్తోందన్నారు. చిన్న, సన్న కారు రైతులకి, ఎస్సీ, ఎస్టీ రైతులకి, మహిళా రైతులకి 50% రాయితీతో పరికరాలు, 5ఎకరాలుపైన భూమి ఉన్న జనరల్ రైతులకి 40% రాయితీతో యంత్ర పరికరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఏవైనా సందేహాలు ఉంటే రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలన్నారు.

# మన చింతపర్తి ఫుడ్ బ్యాంకు ఘన ప్రారంభం

**"ఆకలి లేని సమాజమే లక్ష్యం - మానవత్వమే పరమావధి"**



**వాల్మీకిపురం / పీలేరు – ఆంధ్రనాడు, మే 14:** వాల్మీకిపురం మండలం చింతపర్తి గ్రామంలో ఏర్పాటు చేసిన "మన చింతపర్తి ఫుడ్ బ్యాంకు" గురువారం ఘనంగా ప్రారంభమైంది. గ్రామంలోని గాంధీ బస్ షెల్టర్ ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి గ్రామ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, సామాజిక సేవకులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమానికి విచ్చేసిన అతిథులను నిర్వాహకులు పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి జ్యోతి ప్రజ్వలనతో ఫుడ్ బ్యాంకును ప్రారంభించారు. ఈ సందర్భంగా పేదలు, బాటసారులకు ఆహారం, పానీయాలను పంపిణీ చేశారు. విద్యాజ్యోతి కరెస్పాండెంట్ కుమార్ సార్ మాట్లాడుతూ, ఆకలితో ఉన్న ఎవరైనా ఈ ఫుడ్ బ్యాంకులో అందుబాటులో ఉంచిన ఆహారాన్ని స్వేచ్ఛగా వినియోగించుకోవచ్చని తెలిపారు. ఎండ తీవ్రత దృష్ట్యా ప్రయాణికులు, బాటసారులు ఇక్కడ ఏర్పాటు చేసిన చల్లని నీరు, మజ్జిగ సేవలను ఉపయోగించుకోవాలని సూచించారు. గ్రామ సర్పంచ్ మహితా శేషాద్రి రెడ్డి మాట్లాడుతూ, చింతపర్తి గ్రామ అభివృద్ధిలో భాగంగా 'వెల్ విషర్స్ సంస్థ' చేపట్టిన ఈ సేవా కార్యక్రమం అభినందనీయమని పేర్కొన్నారు. ఆకలితో ఉన్న ప్రతి ఒక్కరికీ ఈ ఫుడ్ బ్యాంకు అండగా నిలుస్తుందని తెలిపారు. రిటైర్డ్ టీచర్ నజీర్ సార్ మాట్లాడుతూ, షేక్ వసీమ్ మరియు గెడి చిరంజీవి గల్ఫ్ దేశాల్లో ఉన్నప్పటికీ స్వగ్రామంపై మమకారంతో దాతల సహకారాన్ని సమీకరించి ఈ ఫుడ్ బ్యాంకును ఏర్పాటు చేయడం గర్వకారణమని కొనియాడారు. అన్నమయ్య జిల్లాలో మదనపల్లి, గుర్రంకొండ, పీలేరు ప్రాంతాల్లో మాత్రమే ఫుడ్ బ్యాంకు సేవలు అందుబాటులో ఉన్నాయని, గ్రామ స్థాయిలో చింతపర్తిలో "మన చింతపర్తి ఫుడ్ బ్యాంకు" ఏర్పాటు చేయడం జిల్లాకే ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. 'మన చింతపర్తి' వాట్సాప్ గ్రూప్ అడ్మిన్లు షేక్ వసీమ్, గెడి చిరంజీవిల ఆలోచనలకు దాతల సహకారం తోడవడంతో ఈ సేవా కార్యక్రమం సాకారమైంది. ఈ సందర్భంగా యువనేత లంకిపల్లి మధుసూదన్ నాయుడు, ఓదేటి మణి కుమార్, హెల్పింగ్ హాండ్స్ పఠాన్ రెడ్డి బాషా (కలికిరి), దాతలు మరియు గ్రామ పెద్దలకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓదేటి మణి కుమార్, కొత్తపల్లి అమ్ము సుధాకర్, మార్టిన్ సుధాకర్, ఇమామ్ ఇర్ఫాన్, లడ్డు, జిలాని, నవతేజ, భరత్, నాగార్జున పలక, మణి కార్తీక్, పంచాయతీ సిబ్బంది, యువకులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాస్ ద్వారా ఉచిత మెగా కంటి వైద్య శిబిరం




**కార్వేటి నగరం, ఆంధ్రనాడు, మే 14:** రాష్ట్రీయ సేవా సమితి (రాస్) ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్. వెంకటరత్నం పొదుపు సంఘాల సంచారకులు వి. నాగరాజు సూచన – సలహాల మేరకు శ్రీ వెంకటేశ్వర అరవింద కంటి ఆసుపత్రి, తిరుపతి వారి సౌజన్యంతో రాస్ పొదుపు సంఘాల కుటుంబాల సౌకర్యార్థం కార్వేటినగరం రాస్ వృద్ధాశ్రమం నందు నేడు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించడం జరిగింది. ఈ శిబిరానికి విచ్చేసిన సభ్యులను ఉద్దేశించి అరవింద్ కంటి ఆసుపత్రి డాక్టర్ హర్షిత్ మాట్లాడుతూ కంటి సమస్యలకు ఆధునికమైన సాంకేతిక పరిజ్ఞానంతో సులభముగా పరిష్కరించుకో వచ్చని కంటి సమస్యలను అలసత్వం చేయక చూపించుకొని తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. నేడు కంటి ఆపరేషన్లకు ఎంపిక అయిన వారందరినీ నేడే హాస్పిటల్ కి తీసుకువెళ్లి రేపు ఆపరేషన్ చేయడం జరుగుతుందని, రాస్ ద్వారా నిర్వహించే అన్ని రకాల కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని క్యాంపు ఆర్గనైజర్ గౌరీశంకర్ తెలిపారు. ఈ కార్యక్రమం లో అరవింద కంటి ఆసుపత్రి వాసవి మౌర్య డాక్టర్ల బృందం, క్యాంపు ఆర్గనైజర్ గౌరీశంకర్,రాస్ సిబ్బంది బాలకృష్ణ, ప్రకాష్ ,భారతి, స్వాతి,ప్రకాష్ , శాంతి, శరవణన్ క్లస్టర్ లీడర్లు, సభ్యులు పాల్గొనడం జరిగింది.

# గ్రామ స్థాయి నుండి టిడిపి పార్టీని బలోపేతం చేయాలి

**ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి**



**కె.వి.పల్లె / పీలేరు – ఆంధ్రనాడు, మే 14:** గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడంతో పాటు, కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల గురించి ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని రాయచోటి మార్కెట్ కమిటీ చైర్మన్, మారెళ్ళ గ్రామపంచాయతీ టిడిపి అబ్జర్వర్ అనుంపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన అన్నమయ్య జిల్లా పరిధిలోని కె.వి.పల్లె మండలం మారెళ్ళ గ్రామ కస్పాలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలతో కలిసి పార్టీ జెండాను ఎగురవేసి గ్రామ సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కార్యకర్తల సంక్షేమంతో పాటు గ్రామాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీలతో పాటు యువగళం పాదయాత్ర సందర్భంగా నారా లోకేష్ ఇచ్చిన హామీలను అమలు చేయడమే కాకుండా, సూపర్ సిక్స్ పథకాలను పకడ్బందీగా అమలు చేస్తూ రాష్ట్రాన్ని ప్రగతి పథంలోకి తీసుకెళుతున్నారని కొనియాడారు. ఇప్పటికే లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకువచ్చి, ఆంధ్రప్రదేశ్‌ను ఐటీ హబ్‌గా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నారని, అలాగే పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని వేగవంతం చేయడంతో పాటు అమరావతి రాజధానికి చట్టబద్ధత కల్పించి నిర్మాణ కార్యక్రమాలను కొనసాగిస్తున్నారని తెలిపారు. తెలుగుదేశం పార్టీ అభివృద్ధి కోసం, పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తున్న నాయకులు, కార్యకర్తల సంక్షేమం కోసం నారా లోకేష్ ప్రత్యేక సంక్షేమ నిధిని ఏర్పాటు చేశారని, గ్రామ స్థాయి నుంచి పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలను గుర్తిస్తూ పార్టీని మరింత ముందుకు తీసుకెళ్లే లక్ష్యంతో పనిచేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడ ఏ కార్యకర్తకు ఇబ్బంది వచ్చినా "మీ వెంట నేనున్నాను" అంటూ నారా లోకేష్ ప్రతి టిడిపి కార్యకర్తకు భరోసా కల్పిస్తున్నారని పేర్కొన్నారు. గ్రామ స్థాయి నుంచి టిడిపి నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ గ్రామ నేతలు గీతమ్మ, నాగేశ్వర, రెడ్డిగఫార్, అశోక్ కుమార్ రెడ్డి, రవీంద్రారెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలోని ఆసుపత్రులు, క్లినిక్‌లు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలి

## డీఎంహెచ్‌వో డాక్టర్ లక్ష్మీనరసయ్య హెచ్చరిక



**మదనపల్లి – ఆంధ్రనాడు, మే 14:** జిల్లాలో ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు, నాణ్యమైన వైద్య సేవలు అందించడమే వైద్య మరియు ఆరోగ్య శాఖ ప్రధాన లక్ష్యమని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ లక్ష్మీనరసయ్య తెలిపారు. జిల్లాలోని ప్రతి ఆసుపత్రి, క్లినిక్, ల్యాబొరేటరీ తప్పనిసరిగా వైద్య మరియు ఆరోగ్య శాఖలో రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలని ఆదేశించారు. డెంగ్యూ, మలేరియా తదితర సీజనల్ వ్యాధులకు సంబంధించిన పాజిటివ్ కేసులను వెంటనే వైద్య మరియు ఆరోగ్య శాఖకు తెలియజేయాలని సూచించారు. వ్యాధుల నియంత్రణ, నివారణ చర్యలను సమర్థవంతంగా అమలు చేయడానికి ఈ సమాచారం కీలకమని పేర్కొన్నారు. ఆరోగ్య సమస్యలు ఎదురైనప్పుడు ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే చికిత్స పొందాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిపుణులైన వైద్యులు, అవసరమైన మందులు, మెరుగైన వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారులు నిర్వహించే తనిఖీల్లో రిజిస్ట్రేషన్ లేకుండా ప్రైవేట్ ఆసుపత్రులు లేదా ల్యాబొరేటరీలు నిర్వహిస్తున్నట్లు గుర్తిస్తే, సంబంధిత సంస్థలపై అమల్లో ఉన్న వైద్య చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## నాటు సారా స్థావరాలపై ఎస్సై దాడులు



**కార్వేటినగరం – ఆంధ్ర నాడు, మే 14 ;** మండల పరిధిలోని డిఎం పురం గ్రామ సమీపంలోని నాటు సారా స్థావరాలపై ఎస్సై తేజస్విని సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. 300 లీటర్ల ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. మండల పరిధిలోని గ్రామాలలో నాటు సారా విక్రయించిన, తయారుచేసిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సిబ్బంది హంస, కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

## క్యాన్సర్ బాధితుల్లో ఆత్మస్థైర్యం నింపేందుకు కేశాల దానం



**మదనపల్లి – ఆంధ్రనాడు, మే 14:** మదనపల్లిని కేంద్రంగా చేసుకుని పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న హెల్పింగ్ మైండ్స్ సంస్థ ఆధ్వర్యంలో కేశాల దానం కార్యక్రమం నిర్వహించారు. మదనపల్లికి చెందిన మోహన్ రెడ్డి, రమణమ్మ దంపతుల కుమార్తె లక్ష్మీ హెల్పింగ్ మైండ్స్ కార్యాలయానికి విచ్చేసి క్యాన్సర్ బాధితుల కోసం తన కేశాలను దానం చేసి సేవాభావాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా కేశాలు దానం చేసిన లక్ష్మీని హెల్పింగ్ మైండ్స్ బృందం ప్రశంసా పత్రం, పూల మొక్క అందజేసి అభినందించింది. హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకుడు అబూబక్కర్ సిద్ధిక్ మాట్లాడుతూ క్యాన్సర్ బాధితుల ముఖాల్లో చిరునవ్వు తీసుకురావాలనే లక్ష్యంతో రెండేళ్ల క్రితం కేశాల దానం కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఇప్పటివరకు ఐదుగురు క్యాన్సర్ బాధితులకు ఉచితంగా విగ్గులు అందించినట్లు పేర్కొన్నారు. కేశాలు దానం చేసిన లక్ష్మీ మాట్లాడుతూ క్యాన్సర్ బాధితుల్లో ఆత్మస్థైర్యం నింపాలనే ఉద్దేశంతో తన వంతు సహాయంగా కేశాలను దానం చేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాల్లో పాల్గొంటానని పేర్కొన్నారు.

## స్విమ్స్ ఆధ్వర్యంలో పింక్ బస్ ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్



**తిరుపతి – ఆంధ్రనాడు, మే 14:** శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ(స్విమ్స్) ఆధ్వర్యంలో గురువారం తిరుపతి ఇందిరానగర్-2 సచివాలయంలో పింక్ బస్ ద్వారా ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ వైద్య శిబిరం జరిగింది. ముందుగా క్యాన్సర్ వ్యాధి లక్షణాలు, ముందస్తు నివారణ చర్యలపై చిత్రపటాల ద్వారా అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో తిరుపతి జిల్లాలో పింక్ బస్సుల ద్వారా క్యాన్సర్ పై అవగాహన కార్యక్రమాలు, మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వేగవంతంగా జరుగుతున్నాయి. పింక్ బస్సులో మహిళలు, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు రొమ్ము క్యాన్సర్ నిర్ధారణకు మామోగ్రామ్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణ కోసం పాప్ స్మియర్ పరీక్షలు నిర్వహించారు.స్విమ్స్ డైరెక్టర్ కమ్ వైస్ చాన్సలర్ డాక్టర్ ఆర్వీ కుమార్ ఆదేశాల మేరకు కమ్యూనిటి మెడిసిన్ ప్రొఫెసర్ మరియు పింక్ బస్ ప్రాజెక్టు ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ అంజు డి ఆదె మార్గదర్శకత్వంలో నోడల్ ఆఫీసర్లు డాక్టర్ భవాని, డాక్టర్ శివసంతోష్ పర్యవేక్షణలో ఈ వైద్య శిబిరం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు బుల్లెట్ రమణ, విశ్వనాథం, రాజారామ్, ప్రకాశం రోడ్ అర్బన్ పిహెచ్సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ క్రాంతి కుమార్, పింక్ బస్ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ పద్మావతి, డాక్టర్ హరిత, డాక్టర్ లావణ్య, ఏఎన్ఎంలు విజయలక్ష్మీ, జయంతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## గంగమ్మకు పుట్టినింటి సారె సమర్పణ



**పలమనేరు, ఆంధ్రనాడు, మే 14:** స్థానిక శ్రీ తిరుపతి గంగమ్మ జాతర సందర్భంగా శ్రీ సంతాన వేణుగోపాల స్వామి దేవస్థానం నుండి గంగమ్మకు పుట్టినింటి సారె కార్యక్రమం గురువారం భక్తిశ్రద్ధలతో మేళతాళాలతో బాణాసంచా వేడుకలతో ఊరేగింపుగా తీసుకువెళ్లారు. మార్గ మధ్యలో గల శ్రీ సత్య గంగమ్మ తల్లికీ సారెని సమర్పించారు. అనంతరం పట్టణ గ్రామదేవత శ్రీ తిరుపతి గంగమ్మ తల్లికి సారెని సమర్పించి పూజలు చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గంగచాటు పెట్టిన మరుసటి రోజు నుంచి రోజులో ఒక పూటకు ఒక కులస్తులు అభిషేకం, పూజలు చేసి అన్నదానం చేస్తారు. కాగా 14 రోజు వేణుగోపాలస్వామి గుడి తరపున అన్ని కులాలు కలిసి వేణుగోపాల స్వామి గుడి అమ్మవారికి పుట్టినిల్లుగా భావించి అక్కటి నుంచి సారె తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. ఈ కార్యక్రమానికి అన్ని కులస్తులు హాజరై భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పుట్టింటి సారెని సమర్పించుకుని గ్రామ దేవతలను మొక్కుకున్నారు.

# నేడు గంగమ్మ అమ్మవారు కొలువు తీరే వేళ

### - ముగిసిన అమ్మవారి శిరస్సు ఊరేగింపు

**పలమనేరు, ఆంధ్రానాడు, మే 14:** పట్టణ గ్రామదేవతగా పిలువబడే శ్రీ తిరుపతి గంగమ్మ జాతర మహోత్సవాలలో భాగంగా గురువారం అర్ధరాత్రి అమ్మవారి శిరస్సు ఊరేగింపు కార్యక్రమం బ్రహ్మాండంగా నిర్వహిశీచారు. ఆనవాయితీగా పట్టణ మందలి పాతపేట శ్రీ సంతాన వేణుగోపాలస్వామి ఆలయం ఎదుట నుంచి అర్ధ రాత్రి 12 గంటలకు అమ్మవారి శిరస్సుకు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించి శిరస్సు మెరవని కార్యక్రమం ఘనంగా చేపడుతారు. విశేషంగా మొక్కు బడులు తీర్చుకొనే భక్తులు వేలాది టెంకాయలు కొడుతారు. ఇలా పాతపేట నుంచి ఊరేగింపు కొనసాగి కొత్తపేట గంగమ్మ ఆలయం చేరుకొన్నేశీదుకు శుక్రవారం ఉదయం అయ్యింది. ఆ పాటికే అమ్మవారు విశ్వరూపంలో దర్శనం ఇచ్చేందుకు అవసరమైన ఏర్పాట్లు ఆలయ అధికారులు, కమిటీ సభ్యులు



చేపట్టారు.

**నేడు విశ్వరూపం దర్శనం**

నేడు ఉదయం ఐదు గంటలు ప్రాంతం నుంచి అమ్మవారు ఆలయం వద్ద విశ్వరూపంగా కొలువై భక్తులకు దర్శనం ఇస్తారు. ఇందులకు గాను అమ్మవారి ఆలయం ఎదుట ఈ పాటికే చలువ పందిళ్ళు వేసి సిద్ధం చేసారు. వేలాదిగా వచ్చే భక్తులకు ఎటువంటి ఆటంకం కలగకుండా అమ్మవారి దర్శన భాగ్యం కల్పించేందుకు ఉత్సవ కమిటీతో పాటు పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపడుతూ ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా డిఎస్పీ దేగల ప్రభాకర్ పర్యవేక్షణతో పాటు పట్టణ, రూరల్ సీఐ ఆద్వర్యంలో గట్టి భద్రతా చర్యలు తీసుకొంటున్నారు. ఈ సందర్భంగా తమిళనాడు, కర్ణాటక ప్రాంతం నుంచి కూడా అమ్మవారి భక్తులు విశేష సంఖ్యలో రానున్నారు.వీరికి అమ్మవారి ఆలయం దగ్గర,ఆ ప్రాంతంలో పలు కుల సంఘాలు అన్నదాన, ప్రసాద వితరణలు చేపట్టనున్నారు.

**శనివారం జలిదీ కార్యక్రమం**

శనివారం ఉదయం జలిది కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. జాతర సందర్భంగా పట్టణంలో ఇంటిల్లి పాదీ బంధు మిత్రులతో ఈ పాటికే కిటకిటలాడుతున్నది.

# ఆంధ్రప్రదేశ్‌లో "మష్రూమ్ మిషన్ 2026-31"

### పుట్టగొడుగుల సాగుతో గ్రామీణ ఆర్థిక విప్లవానికి ప్రభుత్వం భారీ ప్రణాళిక

**పీలేరు – ఆంధ్రనాడు, మే 14:** వ్యవసాయ రంగంలో పెరుగుతున్న ఉత్పత్తి వ్యయాలు, తగ్గుతున్న లాభాల నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాల వైపు మొగ్గు చూపుతున్నారు. ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులు, మహిళలు, గ్రామీణ యువతకు తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు ఇచ్చే వ్యవసాయ ఆధారిత పరిశ్రమలపై ఆసక్తి పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా "మష్రూమ్ మిషన్ 2026-31"ను రూపొందిస్తోంది. రాష్ట్రాన్ని దేశంలోనే అతిపెద్ద పుట్టగొడుగుల ఉత్పత్తి, ప్రాసెసింగ్ కేంద్రంగా తీర్చిదిద్దడమే ఈ మిషన్ ప్రధాన లక్ష్యం. రైతులకు సబ్సిడీలు, శిక్షణ, మార్కెటింగ్, నిల్వ కేంద్రాలు, ప్రాసెసింగ్ యూనిట్లు, ఎగుమతి అవకాశాలు కల్పించడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. 13 వేల కోట్ల భారీ ప్రణాళిక ఈ మిషన్ అమలుకు ప్రభుత్వం సుమారు ?13,000 కోట్ల పెట్టుబడితో ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ఇందులో దాదాపు 5,184 కోట్లను సబ్సిడీల రూపంలో రైతులు, మహిళా సంఘాలు, యువ పారిశ్రామికవేత్తలకు అందించే అవకాశముంది. ఈ ప్రాజెక్టు ద్వారా పుట్టగొడుగుల సాగుతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో మష్రూమ్ ఆధారిత పరిశ్రమల అభివృద్ధికి కూడా ప్రాధాన్యం ఇవ్వనున్నారు. పుట్టగొడుగుల సాగుపై ఎందుకు ప్రత్యేక దృష్టి? ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్యకరమైన ఆహారంపై అవగాహన పెరుగుతోంది. అధిక ప్రోటీన్, తక్కువ కొవ్వు, విటమిన్లు, ఖనిజలవణాలు సమృద్ధిగా ఉండటం వల్ల పుట్టగొడుగులకు భారీ డిమాండ్ ఏర్పడింది. భారతదేశంలో హోటళ్లు, రెస్టారెంట్లు, ఫుడ్ ప్రాసెసింగ్ కంపెనీలు మష్రూమ్ ఉత్పత్తులను విస్తృతంగా వినియోగిస్తున్నాయి. పుట్టగొడుగుల సాగు ప్రత్యేకతలు తక్కువ భూమిలో సాగు సాధ్యం నీటి వినియోగం తక్కువ వ్యవసాయ వ్యర్థాల వినియోగం 25-40 రోజుల్లో దిగుబడి మహిళలకు అనుకూలమైన ఉపాధి గ్రామీణ యువతకు స్వయం





ఉపాధి అవకాశాలు ప్రభుత్వం ప్రోత్సహించే మష్రూమ్ రకాలు ఆయిస్టర్ మష్రూమ్ – తక్కువ పెట్టుబడితో సులభ సాగు మిల్కీ మష్రూమ్ – వేడి వాతావరణానికి అనుకూలం బటన్ మష్రూమ్ – హోటల్ పరిశ్రమలో అధిక డిమాండ్ పాడీ స్ట్రా మష్రూమ్ – వరి గడ్డితో సాగు చేసే సంప్రదాయ పద్ధతి ప్రభుత్వం అందించే సహాయం మష్రూమ్ షెడ్లు ఉష్ణోగ్రత, తేమ నియంత్రణ కోసం ప్రత్యేక షెడ్ల నిర్మాణానికి సబ్సిడీలు. స్పాన్ ఉత్పత్తి కేంద్రాలు నాణ్యమైన మష్రూమ్ విత్తనాల తయారీకి యూనిట్లు. కోల్డ్ స్టోరేజ్ పుట్టగొడుగుల నిల్వ కోసం శీతల గిడ్డంగులు. ప్రాసెసింగ్ యూనిట్లు డ్రై మష్రూమ్స్, పౌడర్లు, పికిల్స్, సూప్ మిక్స్‌ల తయారీకి ప్రోత్సాహం. మార్కెటింగ్ ఉ ఎగుమతులు రైతులను మార్కెట్లతో అనుసంధానం చేసి విదేశీ మార్కెట్లకు ఎగుమతులు పెంచే చర్యలు. మహిళా సంఘాలకు ప్రత్యేక అవకాశాలు స్వయం సహాయక మహిళా సంఘాలను ఈ మిషన్‌లో కీలక భాగస్వాములుగా మార్చాలని ప్రభుత్వం భావిస్తోంది. వారికి: ఉచిత శిక్షణ యంత్రాల సబ్సిడీ బ్యాంకు రుణాలు మార్కెటింగ్ సహాయం ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు వంటి సదుపాయాలు కల్పించనున్నారు. యువతకు అగ్రి బిజినెస్ అవకాశాలు మష్రూమ్ రంగంలో: స్పాన్ తయారీ ట్రైనింగ్ సెంటర్లు ఆన్‌లైన్ మార్కెటింగ్ ఫుడ్ ప్రాసెసింగ్ డెలివరీ నెట్వర్క్ ఎగుమతి వ్యాపారం వంటి అనేక వ్యాపార అవకాశాలు ఉన్నాయి. ఎంత ఆదాయం పొందవచ్చు? చిన్న యూనిట్: ?50 వేల పెట్టుబడితో నెలకు 15-25 వేల ఆదాయం మధ్యస్థ యూనిట్: 2-5 లక్షల పెట్టుబడితో నెలకు 50 వేల-1 లక్ష వరకు కమర్షియల్ యూనిట్: ప్రాసెసింగ్, బ్రాండింగ్ ఉంటే మరింత అధిక లాభాలు రైతులకు ప్రత్యేక శిక్షణ ఉద్యాన శాఖ, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, వ్యవసాయ శాస్త్ర కేంద్రాల ద్వారా: కంపోస్ట్ తయారీ స్పాన్ వినియోగం ఉష్ణోగ్రత నియంత్రణ వ్యాధి నివారణ ప్యాకింగ్ మార్కెటింగ్ విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ వంటి అంశాలపై శిక్షణలు ఇవ్వనున్నారు. దరఖాస్తు ఎలా? పథకం ప్రారంభమైన



తర్వాత రైతులు: రైతు భరోసా కేంద్రాలు ఉద్యాన శాఖ కార్యాలయాలు డీఆర్‌డీఏ కార్యాలయాలు ఎస్‌ఈఆర్‌పీ కార్యాలయాలు ప్రభుత్వ ఆన్‌లైన్ పోర్టల్స్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. అవసరమైన పత్రాలు ఆధార్ కార్డు బ్యాంక్ పాస్‌బుక్ మొబైల్ నంబర్ భూమి/షెడ్ వివరాలు ఫోటోలు కుల, ఆదాయ ధృవపత్రాలు ప్రాజెక్ట్ రిపోర్ట్ (పెద్ద యూనిట్లకు) గ్రామీణాభివృద్ధికి కొత్త దిశ పుట్టగొడుగుల సాగు కేవలం వ్యవసాయం మాత్రమే కాకుండా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మార్చగల అగ్రి ఇండస్ట్రీగా ఎదిగే అవకాశముంది. ఈ మిషన్ విజయవంతమైతే గ్రామీణ ఉపాధి, మహిళల ఆదాయం, యువత స్వయం ఉపాధి గణనీయంగా పెరుగుతాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. బోధిషా వలి వ్యాఖ్య అన్నమయ్య జిల్లా డివియంసి సభ్యులు బోధిషా వలి మాట్లాడుతూ: "పుట్టగొడుగుల సాగు గ్రామీణ యువతకు, మహిళలకు మరియు చిన్న రైతులకు అద్భుతమైన స్వయం ఉపాధి అవకాశంగా మారుతుంది. తక్కువ పెట్టు బడితో అధిక ఆదాయం ఇచ్చే ఈ రంగాన్ని ప్రభుత్వం మ రింత ప్రోత్సహించాలి. ప్రతి మండలంలో శిక్షణ కేంద్రా లు ఏర్పాటు చేసి, మహిళా సంఘాలకు ప్రత్యేక సబ్సిడీ లు, మార్కెటింగ్ సదుపాయాలు కల్పిస్తే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుంది," అని పేర్కొన్నారు.



# ప్రైవేట్ పాఠశాలల మనుగడకు ముప్పు - ఎంఈఓకు వినతి

**మదనపల్లి – ఆంధ్రనాడు, మే 14:** ప్రైవేట్ పాఠశాలలో చదువుతూ విద్యా సంవత్సరం ప్రారంభంలో ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థులకు ఆయా పాఠశాలల కరస్పాండెంట్ల ప్రమేయం లేకుండా యుడైస్ నందు తొలగించడం, టీసిలు మంజూరు చేయాలనడం వంటి విద్యాశాఖ నిర్ణయాలు ప్రైవేటు పాఠశాలలకు తీవ్రం నష్టం కలిగిస్తాయని విద్యోదయ కరస్పాండంట్ శ్రీనివాసులు నాయుడు, న్యూ లిటిల్ ఫ్లవర్ రామకృష్ణ రెడ్డి, సాయి విద్యానికేతన్ శ్రీనివాసరావు, బ్రహ్మర్షి, కేశవ రెడ్డి, ఎస్వీఎల్ ప్రవీణ్, డైమండ్ చక్రపాణి, విజేత శ్రీనివాస శర్మలు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం మండల విద్యాశాఖ అధికారి ఎం. ప్రభాకర్ రెడ్డికి వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో సుప్రీం కోర్టు ఏదైనా విద్యార్థి ప్రైవేట్ పాఠశాల నుండి ప్రభుత్వ పాఠశాలకు మారాలంటే, బ్యాలెన్స్ ఉన్న ఫీజులో కనీసం 50 శాతం చెల్లించి టీసీలు తీసుకోవాలని మరియు మిగతా బ్యాలెన్స్ మొత్తాన్ని ఆరు విడతలలో చెల్లించాలని తీర్పు ఇచ్చిందన్నారు. అనంతరం ఆయా కరెస్పాండెంట్ల అనుమతితో విద్యార్థి చేరే ప్రభుత్వ/ప్రవేటు పాఠశాలల చైల్డ్ ఇన్ఫోలో నమోదు చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందన్నారు. అయితే ప్రస్తుతం విద్యాశాఖ ప్రైవేటు పాఠశాలల్లో చదివే విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరా



లంటే కరస్పాండెంట్ల అనుమతి అవసరం లేదంటూ ఆదేశాలు జారీ చేయడం అభ్యంతరకరమన్నారు. ఇటువంటి నిర్ణయాలు ప్రైవేట్ పాఠశాలల మనుగడకు ప్రమాదకరమన్నారు. ఈ నిర్ణయంపై మండల విద్యాశాఖ, జిల్లా విద్యాశాఖ అధికారులు పునరాలోచించాలని, తమ విజ్ఞప్తిని రాష్ట్ర విద్యాశాఖ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ అంశాన్ని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ఉన్నత విద్యాశాఖ అధికారులు దృష్టికి తీసుకెళ్లి ప్రైవేటు పాఠశాలలకు ఇబ్బంది లేకుండా చూస్తామని ఎంఈఓ హామీ ఇచ్చారు.

## జలదార జలహారతి పనులు పరిశీలించిన ఇరిగేషన్ ఏఈ నరసింహులు



**కురబలకోట, ఆంధ్రనాడు, మే 14:** మండలంలోని కనసానివారిపల్లి పంచాయతీ పరిధిలోని దిగువ బోయపల్లి సమీపంలో కొనసాగుతున్న జలదార–జలహారతి పనులను ఇరిగేషన్ ఏఈ నరసింహులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభానికి ముందే పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యంగా ఉపాధి హామీ కూలీల సంఖ్యను పెంచి కాలువల తవ్వకాలు, చెరువుకు నీరు చేరే మార్గాల అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జూన్ నెలలో వర్షాలు ప్రారంభమయ్యే అవకాశమున్న నేపథ్యంలో అప్పటికల్లా పనులు పూర్తయితే చెరువులు నిండేందుకు, రైతులకు సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయని తెలిపారు. జలదార--జలహారతి పనుల ద్వారా భూగర్భ జలాల మట్టం పెరగడంతో పాటు వ్యవసాయానికి మేలు చేకూరుతుందని పేర్కొన్నారు. అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తూ నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పనులు త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో టెక్నికల్ అసిస్టెంట్ నాగార్జున ఫిల్డ్ అసిస్టెంట్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## మే 16న గోవింద భజన్ క్లబ్బింగ్




**తిరుపతి, మే 14 (ఆంధ్రనాడు):** దేశవ్యాప్తంగా యువతను విశేషంగా ఆకట్టుకుంటున్న భజన్ క్లబ్బింగ్ కాన్సెప్ట్ ఆధ్యాత్మిక కార్యక్రమం మే 16న తిరుపతిలోని శ్రీ కన్వెన్షన్ హాల్ ఒకటి నందు నిర్వహిస్తున్నామని గోవింద భజన్ క్లబ్బింగ్ డైరెక్టర్ డా. ఎన్.గిరిబాబు చెప్పారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో భక్తి సంగీతంతో మేళవించడం, సౌండ్ సిస్టం, డిమ్ లైట్స్ మధ్య హరే రామ,హరే కృష్ణ గోవింద నామస్మరణ వంటి భజనలు ప్రత్యేక ఆకర్షణగ ఉంటాయన్నారు. కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొనేలా ఫ్యామిలీ, ఫ్రెండ్లీ వాతావరణాన్ని ఏర్పాటు చేశామన్నారు. బెంగళూరు, ముంబై, ఢిల్లీ వంటి మెట్రో నగరాల్లో ఇప్పటికే విజయవంతమైన ఈ కాన్సెప్ట్ తిరుపతి వాసులను కూడా అలరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన టిక్కెట్లు బుక్ మై షో వేదికలో లభిస్తాయన్నారు. వివిధ విద్యా సంస్థలలో చదువుతున్న విద్యార్థులకు ఐడి కార్డు చూపిస్తే ఉచితంగా అనుమతిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్తికేయ సేవా ట్రస్ట్ కన్వీనర్ కడం వెంకట సుదీప్ కుమార్,గోవింద భజన్ క్లబ్బింగ్ కన్వీనర్ కృష్ణ, సభ్యులు రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కోటకొండ గంగమ్మా.. చల్లంగ చూడమ్మా!

### -తంబళ్లపల్లి జాతరకు పోటెత్తిన భక్తులు



**తంబళ్లపల్లి – ఆంధ్రనాడు, మే 14:** తంబళ్లపల్లికి సమీపంలోని సంతోపులో వెలసిన కోటకొండ గంగమ్మ పగలు తిరునాల గురువారం వైభవంగా జరిగింది. కోటకొండ గంగమ్మ తల్లి చల్లంగ చూడమ్మా అంటూ భక్తులు అమ్మవారికి పొంగళ్ళు నైవేద్యంగా సమర్పించారు. కాయ కర్పూరాలు సమర్పించి కర్పూర హారతులతో ప్రత్యేక పూజలు చేసి అమ్మవారిని వేడుకున్నారు. బుధవారం రాత్రి పలు గ్రామాల ప్రజలు సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటాలు, చెక్క భజనలు, బాణా సంచా పేలుళ్ల నడుమ ఊరేగింపుగా వెళ్ళి అమ్మవారి ఆలయం చుట్టూరా తిప్పి మొక్కులు తీర్చుకున్నారు. తిరుణాళ్లలో గాజుల అంగళ్ళు, పిల్లల అట వస్తువులు, మిఠాయిల దుకాణాలతో కిక్కిరిసిపోయాయి. గురువారం తెల్లవారుజాము నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున ప్రజలు తరలి రావడంతో ఆలయ ప్రాంగణం అంతా జన సంద్రంగా మారింది. సాయంత్రం అమ్మవారిని పల్లకిలో ఆలయం చుట్టూరా తిప్పి భక్తులకు అమ్మవారి దీవెనలు, బండారు అందజేశారు.



# అసాంఘిక శక్తుల ఆటకట్టిస్తాం

- గంజాయి, రౌడీ మూకలపై కఠిన చర్యలు
- అవసరమైతే పీడీ యాక్టు ప్రయోగం
- స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రత్యేక నిఘా

**మదనపల్లి – ఆంధ్రనాడు, మే 14:** జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అసాంఘిక శక్తులు, గంజాయి ముఠాలు, రౌడీ మూకలపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఐపీఎస్ పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అవసరమైతే పీడీ యాక్టు ప్రయోగించి చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. గురువారం మదనపల్లిలోని జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ వివిధ కేసుల పురోగతిని సమీక్షించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గ్రామాలు, వార్డుల స్థాయిలో పోలీసు పర్యటనలు పెంచాలని సూచించారు. గతంలో గొడవలకు పాల్పడినవారు, శాంతిభద్రతలకు భంగం కలిగించే అవకాశం ఉన్న వ్యక్తులను ముందుగానే గుర్తించి బైండోవర్ చేయాలన్నారు. హిస్టరీ షీటర్ల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని స్పష్టం చేశారు. జిల్లాలో గంజాయి విక్రయాలు, రవాణాపై రాజీలేని పోరాటం చేయాలని అధికారులను ఆదేశించారు. గంజాయి కేసుల్లో పట్టుబడిన నిందితులపై కొత్తగా హిస్టరీ షీట్లు ప్రారంభించాలని సూచించారు. యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని పేర్కొన్న ఎస్పీ, వ్యాపార వర్గాలు, అపార్టుమెంట్ వాసులతో సమన్వయం చేసుకుని ప్రధాన





కూడళ్లలో కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. దర్యాప్తులో పారదర్శకత కోసం ఈ–సాక్ష్య యాప్ వినియోగాన్ని పెంచాలని ఆదేశించారు. మిస్సింగ్ కేసుల్లో ఫేస్ రికగ్నిషన్ టెక్నాలజీ వినియోగించి బాధితులను త్వరగా గుర్తించే చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళల భద్రత, సైబర్ నేరాల నియంత్రణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్పీ స్పష్టం చేశారు. దత్తత కానిస్టేబుళ్లు, మహిళా సంరక్షణ పోలీసులు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని తెలిపారు. అలాగే మైనర్ డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం, డ్రంకన్ డ్రైవ్ వంటి ట్రాఫిక్ ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హత్య, అత్యాచారం, పోక్సో, ఎస్సీ, ఎస్టీ వేధింపుల కేసుల దర్యాప్తులో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని హెచ్చరించిన ఎస్పీ, నిందితులకు శిక్ష పడేలా బలమైన సాక్ష్యాధారాలు సేకరించాలని ఇన్వెస్టిగేషన్ అధికారులకు సూచించారు. ఎఫ్ఎస్ఎల్, డీఎన్ఏ నివేదికలను త్వరితగతిన పొందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు ఎస్పీ (పరిపాలన) ఎం. వెంకటాద్రి, రాయచోటి డీఎస్పీ ఎం.ఆర్. కృష్ణమోహన్, మదనపల్లి డీఎస్పీ బి. పావని, జిల్లాలోని పలువురు సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

# 21 నుండి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

- ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి
- అధికారులకు డిఆర్ఓ
- చంద్రశేఖర్ రెడ్డి ఆదేశం



**మదనపల్లి – ఆంధ్రనాడు, మే 14:** రాష్ట్ర ఇంటర్మీడియట్ విద్యా మండలి ఆదేశాల మేరకు జిల్లాలో ఈ నెల 21 నుండి ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు సర్వం సిద్ధం చేసినట్లు డిఆర్ఓ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. గురువారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా సమన్వయ కమిటీ సమావేశం డిఆర్ఓ చంద్రశేఖర్ రెడ్డి,జిల్లా పరీక్షల కమిటీ కన్వీనర్ రవితో కలిసి పోలీస్, వైద్య, విద్యుత్, ఆరోగ్య,రవాణా మరియు పోస్టల్ వంటి వివిధ శాఖల అధికారులతో ఆయన సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పరీక్షల నిర్వహణపై కీలక సూచనలు జారీ చేశారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 41 కేంద్రాలలో పరీక్షలు నిర్వహించబడతాయనీ, ఈ నెల 21 నుండి పరీక్షలు ప్రారంభమవుతాయనీ తెలిపారు. ఉదయం సెషన్ 9 నుండి 12 గంటల వరకు మధ్యాహ్నం సెషన్ 2 నుండి 5 గంటల వరకు జరుగుతాయన్నారు. మొదటి సంవత్సర పరీక్షలకు 9274 మంది, ద్వితీయ సంవత్సర పరీక్షలకు 5558 మంది వోకేషనల్ 1125 మంది మొత్తం 15957 మంది హాజరవుతారని చెప్పారు. మొత్తం 41 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రాల్లో అనుమతించబడదని, అలాగే విద్యార్థులు ఎలాంటి సెల్ ఫోన్లు,ఎలక్ట్రానిక్ వస్తువులు, పరీక్ష కేంద్రంలో అనుమతించారని తెలిపారు. పరీక్ష కేంద్రాలలో అవసరమైన లైట్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ప్రతి ఒక్క పరీక్షా కేంద్రం వద్ద సిసి కెమెరాలను ఏర్పాటు చేయడం జరిగిందని, పరీక్ష కేంద్రాల్లో ఏదైనా సమస్య వస్తే వెంటనే తెలియజేయుటకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని కంట్రోల్ రూమ్ నెంబర్ 9866112750 కు తెలియజేయవచ్చునని తెలిపారు. పరీక్షా కేంద్రాలవద్ద 163 సెక్షన్ విధించాలని, పరీక్షలు నిర్వహించే పరిసర ప్రాంతాలలో జిరాక్స్ షాపులను మూసివేయాలని చెప్పారు. విద్యార్థులు ఇబ్బంది పడకుండా త్రాగునీరు, మరుగుదొడ్లు లాంటి మౌలిక వసతులను కల్పించాలని, పరీక్షా కేంద్రాలకు హాజరయ్యేందుకు వీలుగా ఆర్‌టిసి బస్సులను నడపాలని చెప్పారు. పరీక్ష నిర్వహించే సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని, పారిశుధ్యం, త్రాగునీటి వసతులు, పరిశుద్ధ పనుల ను పంచాయితీశాఖ, మున్సిపాల్టీలు అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. కేంద్రాలవద్ద పటిష్ట పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయాలని చెప్పారు. పరీక్షా సమయంలో దూర ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థులకు రవాణా సౌకర్యాలు కల్పించాలని ఆర్టీసీ అధికారులకు ఆదేశించారు. ప్రతీ పరీక్షా కేంద్రంవద్ద వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని ఓ ఆర్ ఎస్ పాకెట్లు, అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలని వైద్యాధికారులకు తెలిపారు. ప్రతీ కేంద్రంవద్దా సిట్టింగ్ స్క్వాడ్ తోపాటు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఇంటర్ మీడియట్ పరీక్షలకు సంబంధించిన విద్య, పోలీస్, రవాణా, విద్యుత్తు, వైద్య, పోస్టల్, మున్సిపాలిటీ, పంచాయతీ రాజ్, లేబర్, పోస్టల్ తదితర శాఖలు పరీక్షలు అత్యంత పారదర్శకంగా, క్రమశిక్షణతో నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని డిఆర్ఓ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరీక్షల నిర్వహణ కమిటి మరియు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి రవి, డీఈవో సుబ్రహ్మణ్యం, సమగ్ర శిక్ష ఏపీసీ శ్రీమతి అనురాధ, మదనపల్లి మున్సిపల్ కమిషనర్ ప్రమీల, మున్సిపల్ శాఖ డి వై ఈఈ పి శ్రావణి, సర్వ శిక్ష అభియాన్ అధికారిని డిపిఎమ్ఓ రమేష్ బాబు,ఆర్టీసీ డిఎం ఎం. వి. ఆర్. రెడ్డి, ఇన్స్పెక్టర్ రామాంజనేయులు, పోస్టల్ అధికారిణి సునంద, విద్యుత్ శాఖ అధికారి తదితరులు పాల్గొన్నారు.



# చైతన్య సంస్థలో విద్యార్థులకు యూనిఫాం కోట్స్ పంపిణీ

- హయాన్ష్ కృష్ణ కుటుంబ సభ్యుల సేవలను అభినందించిన నిర్వాహకులు

**మదనపల్లి – ఆంధ్రనాడు, మే 14:** పట్టణంలోని దేవత నగర్ నాలుగో నెంబర్ రోడ్డు నందు గల చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థలో మదనపల్లికి చెందిన ఆకుల నాగరాజు కుమారుడు ఆకుల హయాన్ష్ కృష్ణ పుట్టినరోజుని పురస్కరించుకొని గురువారం చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థలోని 90 మంది చిన్నారులకు స్కూల్ యూనిఫామ్ కోట్స్ మరియు జ్యూస్ బాటిల్స్ అందజేసి వారి మధ్య కేక్ కట్ చేసి వారి సంతోషాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా సంస్థ జనరల్ సెక్రెటరీ ఏ.కవిత రాణి మాట్లాడుతూ ఆకుల హయాన్ష్ కృష్ణ తల్లిదండ్రులకు హృదయపూర్వక కృతజ్ఞతాభివందనాలు తెలియజేస్తూ విధాత లాంటి దాతలు రాబోవు విద్యా సంవత్సరానికి చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నడపబడుతున్న ముత్తు ఆంగ్ల మాధ్యమ పాఠశాల విద్యార్థులకు అన్నదానంతోపాటు విద్యాదానంకు సహకరిస్తున్నటువంటి విధాత లాంటి దాతలు అందరికీ హృదయపూర్వక కృతజ్ఞతాభివందనాలు తెలియజేస్తున్నామన్నారు. దాతల సహకారంతో సంస్థలోని చిన్నారులకు మరియు వృద్ధులకు మెరుగైన సౌకర్యాలు అందిస్తామని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హయాన్ష్ కృష్ణ కుటుంబ సభ్యులు, సంస్థ జనరల్ సెక్రెటరీ ఏ.కవితా రాణి చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ సి బ్బంది జనార్ధన రెడ్డి, ప్రసన్న, భారతి, భార్గవి పాల్గొన్నారు.



## వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మురళి కుటుంబ సభ్యులను కలిసిన శంకర్ రెడ్డి



**సత్యవేడు – ఆంధ్రనాడు, మే 14:** సత్యవేడు నియోజకవర్గం నాగలాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మురళి (చికెన్ చిన్న) కుటుంబ సభ్యులను టిడిపి నియోజకవర్గ ప్రోగ్రాం కోఆర్డినేటర్ కూరపాటి శంకర్ రెడ్డి కలిశారు. సత్యవేడులో గంగ జాతరను పురస్కరించుకుని గురువారం కూరపాటి శంకర్ రెడ్డి గంగమ్మను దర్శించుకోన్నారు. అనంతరం జడ్పిటిసి విజయలక్ష్మి చంద్రశేఖర్ రెడ్డి ఇచ్చిన గంగ జాతర విందులో పాల్గొన్నారు. తదనంతరం కూరపాటి శంకర్ రెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు శివకుమార్ నాయుడు, సునీల్ జయంతో కలిసి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మురళి( చికెన్ చిన్న) ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను కలిశారు. ఈ క్రమంలో మురళి సతీమణితో పాటు సోదరులు కూడా పిలిపించుకుని యోగక్షమను అడిగి తెలుసుకున్నారు. అన్నదమ్ములు ఐక్యంగా ముందుకు వెళ్లాలని ఏ సమస్య వచ్చిన తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తారని, చికెన్ చిన్న తన కుటుంబ సభ్యుల్లో ఒకరుగా భావిస్తానని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## అక్రమ లేఔట్లపై అధికారుల హెచ్చరిక బోర్డులు

**- కొనుగోలుదారులు అప్రమత్తంగా ఉండాలని సూచన**




**కురబలకోట – ఆంధ్రనాడు, మే 14:** కురబలకోట మండల పరిధిలో అక్రమంగా ఏర్పాటు చేసిన లేఔట్లపై అధికారులు చర్యలు చేపట్టారు. అంగళ్లు బైపాస్ రోడ్డు, కురబలకోట, కడప రోడ్డు పరిధిలోని సర్వే నంబర్లు 1750/1, 1751, 850, 569, 543లలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు అనుమతులు లేకుండా లేఔట్లు ఏర్పాటు చేసినట్లు అధికారులు గుర్తించారు. ఈ లేఔట్లను రెగ్యులరైజ్ చేసుకోవాలని పంచాయతీ అధికారులు పలుమార్లు సంబంధిత నిర్వాహకులకు సూచించినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి నోటీసులు కూడా జారీ చేసినప్పటికీ, వారి నుంచి ఎలాంటి స్పందన రాలేదని పేర్కొన్నారు. అనంతరం విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా, చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అక్రమ లేఔట్ల వద్దతో పాటు అంగళ్లు బస్టాండ్ కూడలి, పోలీస్ స్టేషన్ ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఫ్లాట్లు కొనుగోలు చేసే ముందు సంబంధిత పంచాయతీ కార్యాలయాల్లో వివరాలు తెలుసుకుని, అనుమతులు పొందిన లేఔట్లలోనే ఫ్లాట్లు కొనుగోలు చేయాలని ప్రజలకు అధికారులు సూచించారు.

## ఓ ఎల్ ఎల్ యు పి స్కూల్ టెన్త్ టాపర్ కు సన్మానం



**పలమనేరు, ఆంధ్రనాడు, మే 14:** పలమనేరు పట్టణ మందలి ఓ ఎల్ ఎల్ యు పి స్కూల్ లో చదువుతూ గత మార్చి నెలలో జరిగిన పదవ తరగతి ఫలితాలలో టాప్ మార్కులు సాధించిన మహమ్మద్ రిహాన్ (600కు గాను 585 మార్కులు) కు గురువారం సామాజిక సేవా కార్యకర్త మోహన్ రావు శాలువా కప్పి మహారాజా క్యాప్ తో సన్మానించారు. ఈ సందర్భంగా రియాన్ తల్లిదండ్రులైన మస్తాన్ భాష, షాహిరాబాను ఆనందానికి అవధులు లేకుండా పోయింది. రియాన్ తండ్రి 25 సంవత్సరాల నుండి టీ అంగడి నిర్వహిస్తూ రియాన్ ను చదివిస్తున్నాడు. భవిష్యత్తులో చార్టెడ్ అకౌంటెంట్ కావాలని ఈ సందర్భంగా రియాన్ తెలియజేశాడు.

## తిరుపతి రైల్వే స్టేషన్ తాత్కాలిక డైరెక్టర్ గా మోహనకృష్ణ



**తిరుపతి – ఆంధ్రనాడు, మే 15 :** తిరుపతి రైల్వే స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ 30 రోజుల పాటు సెలవులపై వెళ్లనున్నట్లు సమాచారం. నిరంతరం బిజీగా ఉండే ఆయన దీర్ఘకాలిక సెలవులకు వెళ్తుండగా, ఆయన స్థానంలో గుంతకల్ సీనియర్ డీసీఎం మోహన కృష్ణ తాత్కాలికంగా విధులు నిర్వహించనున్నారు.

# ప్రతి గ్రామం ప్రతి మనిషి అభివృద్ధి చెందాలి

**- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యం**
**- శాసనమండలి చీఫ్ విప్,కంచర్ల శ్రీకాంత్**







**రామకుప్పం – ఆంధ్రనాడు, మే 14:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కుప్పం నియోజకవర్గంలో ప్రతి గ్రామం ప్రతి మనిషి అభివృద్ధి చెందాలని లక్ష్యంతో కృషి చేస్తున్నాడని దీనికి ప్రజా సహకారం చాలా అవసరమని శాసనమండలి చీఫ్ విప్ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు, రామకుప్పం మండలం వంశి గాని పల్లి పంచాయతీ లింగాపురం గ్రామానికి చెందిన 20 కుటుంబాలు స్థానిక తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మనీషా ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరారు వారికి కడ అభివృద్ధి కమిటీ చైర్మన్ కంచర్ల శ్రీకాంత్ వారికి టిడిపి కండువాలు వేసి పార్టీలోకి స్వాగతించారు స్థానిక ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తామని వారు పేర్కొన్నారు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గ్రామీణ ప్రాంతాల నిరుద్యోగులు కోసం అనేక శిక్షణా కార్యక్రమాలు కూడా కుప్పంలో ఏర్పాటు చేస్తున్నామని దీనివల్ల స్వయం ఉపాధి ద్వారా కూడా ఉపాధి అవకాశాలు లభిస్తుందని పేర్కొన్నారు దీనితోపాటు వ్యవసాయంగా అభివృద్ధి కోసం కూడా ప్రణాళికలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు మెంబర్ శాంతారామ్ రాష్ట్ర గ్రంథాలయ బోర్డు డైరెక్టర్ మునుస్వామి రామకుప్పం మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి కామ్ రాజు నాయక్, మాజీ అధ్యక్షులు ఆనంద రెడ్డి ఆంజనేయ రెడ్డి రెస్కో వైస్ చైర్మన్ విశ్వనాథ్ ఎంపీపీ సులోచన గుర్రప్ప, వైస్ ఎంపీపీ వెంకట్రామయ్య గౌడ్, కడ పాలకమండలి సభ్యులు రఘు, మాజీ వైస్ ఎంపీపీ చిన్ని కృష్ణ,తెలుగు యూత్ అధ్యక్షులు బాలకృష్ణ టిడిపి నాయకులు చలపతి రామమూర్తి జయశంకర్ నాగభూషణం మహేందర్ నాయుడు సుభాష్ కృష్ణారెడ్డి ఇంకా పలువురు పాల్గొన్నారు

# తొండవాడలో క్యాన్సర్ అవగాహన, స్క్రీనింగ్ పరీక్షలు



**చంద్రగిరి – ఆంధ్రనాడు, మే 14:** చంద్రగిరి మండలం తొండవాడ గ్రామం నందు క్యాన్సర్ అవగాహన, స్క్రీనింగ్ పరీక్షలు ఉచిత వైద్య శిబిరం విజయ వంతంగా నిర్వహించబడినది అని రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ రమేష్ నాథ్ లింగుట్ల ఉన్నారు. ఈ కార్యక్రమం యూనివర్సల్ కాస్మిక్ ఎనర్జీ, తిరుపతిలోని ఎస్.వి ఇన్స్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ అండ్ అడ్వాన్స్డ్ రీసెర్చ్ సెంటర్ (టాటా క్యాన్సర్ ఫౌండేషన్), ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ సంస్థ అధ్యక్షులు డా. రమేష్ నాథ్ లింగుట్ల,డిప్యూటీ ఎంపీడీఓ వెంకట రత్నం తో కలిసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్ నాథ్ మాట్లాడుతూ ప్రాథమిక దశలోనే క్యాన్సర్ వ్యాధిని గుర్తించడం ద్వారా నయం చేసుకొని ప్రాణాపాయం నుండి బయటపడవచ్చని గ్రామీణ ప్రజలకు ఇలాంటి ఉచిత పరీక్షలు ఎంతో మేలు జరుగుతుందని కొనియాడారు. ప్రజలందరూ ఆరోగ్యం పట్ల అవగాహన కలిగి ఉండాలని, స్వర్గీయ రతన్ టాటా మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో పునాది వేసి మనకు అత్యంత సమీపంలో స్థాపించిన టాటా కాన్సర్ హాస్పిటల్ నందు ఇప్పటి డైరెక్టర్ డాక్టర్ ప్రశాంత్ ఆధ్వర్యంలో కాన్సర్ కు సంబందించిన డాక్టర్లు సంధ్య, నాగేశ్వర రెడ్డి, కార్తిక్, రవికుమార్ తదితరులు, హాస్పిటల్ ఇతర విభాగాల మెంబర్లు అందరూ కలిసి చాలా అంకిత భావంతో తక్కువ ఖర్చులతోనే సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. డిప్యూటీ ఎంపీడీఓ వెంకటరత్నం, తొండవాడ గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగరాజులు,గ్రామ పెద్దలు అరుణాచల రెడ్డి, మోహన్ రెడ్డి, ఉమాపతి రెడ్డి, మాట్లాడుతూ తొండవాడ గ్రామంలో కార్యక్రమం నిర్వహించడం సంతోషం అని, పి4 మార్గదర్శిగా డాక్టర్ రమేష్ నాథ్ లింగుట్ల సేవలు విశేషం కొనియాడారు. టాటా కాన్సర్ హాస్పిటల్ నిపుణులైన వైద్యులు, పారామెడికల్ సిబ్బంది 20 నుండి 65 ఏళ్ల లోపు స్త్రీ, పురుషులకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి, క్యాన్సర్ నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి, తొండవాడ గ్రామం మాజీ సర్పంచ్ ఎం. దీపిక, రెడ్ క్రాస్ సంస్థ డాక్టర్ సాయి దేదీప్యా, కార్యక్రమం ఏర్పాటు చేసిన యూనివర్సల్ కాస్మిక్ ఎనర్జీ సెక్రటరీ పీ.భానుశ్రీ, ప్రతినిధులు పాల్గొన్నారు.

# మహిషాసురమర్దినిని దర్శించుకున్న నూక తోటి రాజేష్



**సత్యవేడు – ఆంధ్రనాడు, మే 14:** సత్యవేడు గంగ జాతర నేపథ్యంలో మహిషాసుర మర్దిని స్వరూపంగా పట్టణంలోని గంగ మిట్ట వద్ద కొలువుతీరిన అమ్మవారిని సత్యవేడు వైఎస్ఆర్సిపి నియోజకవర్గ ఇన్చార్జ్ నూక తోటి రాజేష్ దర్శించుకున్నారు. గురువారం ఆయన వైఎస్ఆర్సిపి మండల కన్వీనర్ సుశీల్ కుమార్ రెడ్డి, జిల్లా సీనియర్ నాయకులు బీరేంద్ర వర్మ, వైఎస్ఆర్సిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నిరంజన్ రెడ్డి, వైస్ ఎంపీపీ సరవన, బెల్ట్ రమేష్, సెంథిల్ కుమార్, పలని, శ్రీధర్ రెడ్డి, భాను ప్రకాష్ రెడ్డి, ధనపాల్ తదితరులతో కలిసి గంగమ్మను దర్శించుకుని పూజలు చేశారు. సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, అష్టైశ్వర్యాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలన్న ఉద్దేశంతోనే తరతరాలుగా గంగ జాతర నిర్వహించుకుంటున్నట్లు సందర్భంగా వైఎస్ఆర్సిపి ఇన్చార్జ్ నూకతోటి రాజేష్ చెప్పారు.

## గంగమ్మను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి ధనశేఖర్



**సత్యవేడు – ఆంధ్రనాడు, మే 14:** సత్యవేడు పట్టణంలోని గంగ మిట్ట వద్ద మహిషాసుర మర్దిని స్వరూపంగా కొలువుతీరిన గంగమ్మను రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి ధనశేఖర్ దర్శించుకున్నారు. గంగ జాతరను పురస్కరించుకుని గురువారం స్థానిక జ్యుడీషియల్ కోర్టు న్యాయమూర్తి వెంకటనాగరాజు వెంట రాగా హైకోర్టు న్యాయమూర్తి ధనశేఖర్ కుటుంబ సభ్యులతో కలిసి గంగమిట్ట వద్దకు చేరుకున్నారు. ఈ నేపథ్యంలో ఉత్సవ కమిటీ సభ్యులు అడ్వకేట్ గోపీనాథ్ న్యాయమూర్తికి ఘన స్వాగతం పలికారు. అనంతరం న్యాయమూర్తి ధనశేఖర్ కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. తదనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు గోపీనాథ్ న్యాయమూర్తికి అమ్మవారి చిత్రపటాన్ని అందించారు.



## గంగమ్మను దర్శించుకున్న కూరపాటి శంకర్ రెడ్డి దంపతులు

**సత్యవేడు – ఆంధ్రనాడు, మే 14:** సత్యవేడులో గంగ జాతర సందర్భంగా పట్టణంలోని గంగ మిట్ట వద్ద మహిషాసుర మర్దిని అవతారంలో భక్తులకు దర్శనమిస్తున్న గంగమ్మను నియోజకవర్గ టిడిపి ప్రోగ్రాం కోఆర్డినేటర్ కూరపాటి శంకర్ రెడ్డి దంపతులు దర్శించుకున్నారు. గురువారం మధ్యాహ్నం ఒక గంట సమయంలో టిడిపి మండల అధ్యక్షులు శివకుమార్ నాయుడు, జడ్పిటిసి విజయలక్ష్మి చంద్రశేఖర్ రెడ్డి, నాగలాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మురళి( చికెన్ చిన్న ) మోహన్ రెడ్డి, సునీల్ జైన్ తదితరులు వెంటరాగా కూరపాటి శంకర్ రెడ్డి దంపతులు గంగమ్మను దర్శించుకుని పూజలు నిర్వహిం చారు. ఈ నేపథ్యంలో అర్చకులు గంగమ్మకు పూజలు చేసి అమ్మవారి గాజులను, పండ్లు పుష్పాలను శంకర్ రెడ్డి సతీమణికి అందించారు. ఈ క్రమంలో గంగ జాతర ఉత్సవ కమిటీ సభ్యులు అడ్వకేట్ గోపీనాథ్ కూరపాటి శంకర్ రెడ్డి ఇతర టిడిపి నాయకులను పూలమాలతో సత్కరించి అమ్మవారి చిత్రపటాలను అందించారు. సంస్కృతి సాంప్రదాయాలకు గంగ జాతర అద్దం పడుతుందని, ఐక్యతకు కూడా ఇది సంకేతకంగా నిలుస్తుందని ఈ సందర్భంగా టిడిపి నియోజకవర్గ ప్రోగ్రాం కోఆర్డినేటర్ కూరపాటి శంకర్ రెడ్డి తెలియజేశారు.

శుక్రవారం
15.05.2026
తిరుపతి – చిత్తూరు
అన్నమయ్య– అనంతపురం
ఆంధ్రనాడు

# ఆ వివాదం నాలో మార్పు తెచ్చింది... లోకజ్ఞానం పెంచుకున్నా: నిత్యా మీనన్



ప్రభాస్ గురించి జర్నలిస్టు అడిగిన ప్రశ్నకు నిత్యామీనన్ సమాధానంపై అప్పట్లో దుమారం ఒక్క మాటను పట్టుకుని రాద్ధాంతం చేశారన్న నిత్యామీనన్
ఆ సంఘటన తర్వాత అందరి దగ్గర నిజాయతీగా ఉండకూడదని నిర్ణయించుకున్నానని వెల్లడి
తన కెరీర్ ప్రారంభంలో ఒక హీరో గురించి అడిగిన ప్రశ్న, ఆ తర్వాత తనను ఇబ్బంది పెట్టిందని, దీంతో తాను లౌక్యంగా మాట్లాడడం నేర్చుకున్నానని ప్రముఖ సినీ నటి నిత్యామీనన్ అన్నారు. ఆమె కెరీర్ ప్రారంభంలో ఒక జర్నలిస్ట్ అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ, "ప్రభాస్ ఎవరు?" అని రిప్లయ్ ఇవ్వడం అప్పట్లో చర్చకు దారి తీసింది. ఈ అంశంపై ఇటీవలి ఇంటర్వ్యూలో ఆమె స్పందించారు.


ఆ సమయంలో తాను చాలా అమాయకంగా ఉండేదానని, ఒక్క మాటను పట్టుకుని రాద్ధాంతం చేయడం తనను చాలా ఇబ్బందికి గురిచేసిందని అన్నారు. తన నిజాయతీని, అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కొంతమంది ఈ విషయాన్ని పెద్దది చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ సంఘటన తర్వాత అందరి దగ్గర నిజాయతీగా ఉండడం పనికిరాదన్న విషయం అర్థమైందని వెల్లడించారు.

కొన్నిసార్లు తెలివిగా మాట్లాడటం అవసరమని తాను తెలుసుకున్నానని అన్నారు. ప్రతి ఒక్కరు తన నిజాయతీకి అర్హులు కారని అర్థమైందని ఆమె పేర్కొన్నారు. ఆ తర్వాత తాను లోకజ్ఞానాన్ని పెంచుకున్నానని అన్నారు. నాడు ప్రభాస్ అంశం కారణంగా తాను ఎంతో ఇబ్బందిపడ్డానని వాపోయారు.

దాదాపు రెండు సంవత్సరాల పాటు సినిమాలకు దూరంగా ఉండి, తనను తాను తెలుసుకోవడానికి ప్రయత్నించానని తెలిపారు. ఆ సమయంలో కొన్ని ఫేక్ ఫొటోలు సృష్టించి తనను మానసికంగా కృంగదీసే ప్రయత్నం చేశారని అన్నారు. ఇలాంటి ఘటనలు తనకు జీవితంలో ఎంతో నేర్పాయని, అప్పటి నుంచి తాను మనుషులను అంచనా వేయడంలో చాలా మారిపోయానని వెల్లడించారు.

# దర్శకుడిగా మారుతున్న హీరో రామ్... రేపే ప్రకటన

రెండు దశాబ్దాల పాటు కెమెరా ముందు మ్యాజిక్ చేసిన రామ్
ఇక మెగాఫోన్ పట్టనున్న ఎనర్జిటిక్ స్టార్
23వ చిత్రంతో దర్శకుడిగా అదృష్టాన్ని పరీక్షించుకోనున్న వైనం



ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని దర్శకుడిగా మారనున్నారు. 'దేవదాసు' చిత్రంతో హీరోగా రామ్ ప్రయాణం మొదలైంది. తనదైన నటన, చలాకీతనంతో, అదిరిపోయే డ్యాన్సులతో అభిమానులను సంపాదించుకున్నారు. రెండు దశాబ్దాల పాటు కెమెరా ముందు మ్యాజిక్ చేసిన రామ్ ఇప్పుడు మెగా ఫోన్ పట్టుకోనున్నారు. రామ్ హీరోగా నటిస్తున్న తదుపరి చిత్రంలో అభిమానులకు అదిరిపోయే వార్త సిద్ధమైంది.

హీరోగా తన 23వ చిత్రానికి రామ్ స్వయంగా దర్శకత్వం వహించనున్నాడు. ఈ చిత్రంతో ఆయన దర్శకుడిగా తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన అధికారిక ప్రకటన రేపు శుక్రవారం ఉదయం 10:08 గంటలకు అట్టహాసంగా వెలువడనుంది. తాను దర్శకుడిగా మారనున్నట్లు రామ్ రేపు అధికారికంగా ప్రకటించనున్నారు. ఇది తన డ్రీమ్ ప్రాజెక్టు కావడంతో, ఆయనే దర్శకత్వం చేయాలనుకుంటున్నారు.

ఈ చిత్రానికి సంబంధించి ప్రీప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఈ చిత్రానికి సామ్ పీఎస్ సంగీత దర్శకుడిగా వ్యవహరించనున్నారు. నటీనటులు, సాంకేతిక నిపుణుల ఎంపిక పూర్తయ్యాక, తర్వాత రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. అభిమానులు రేపు రామ్ అధికారిక ప్రకటన కోసం ఎదురుచూస్తున్నారు.

# తిలక్ వర్మ డైనమిక్ బ్యాటింగ్.. పంజాబ్‌పై ముంబై థ్రిల్లింగ్ విక్టరీ

**- పంజాబ్ కింగ్స్‌పై 6 వికెట్ల తేడాతో ముంబై ఇండియన్స్ విజయం**
**- 201 పరుగుల భారీ లక్ష్యాన్ని 19.5 ఓవర్లలో ఛేదించిన ముంబై**
**- కేవలం 33 బంతుల్లో 75 పరుగులు చేసి అజేయంగా నిలిచిన తిలక్ వర్మ**




ధర్మశాల వేదికగా జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ అద్భుత విజయాన్ని నమోదు చేసింది. పంజాబ్ కింగ్స్‌తో జరిగిన ఉత్కంఠభరిత పోరులో 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. 201 పరుగుల భారీ లక్ష్యాన్ని ఆఖరి ఓవర్లో ఛేదించింది. యువ బ్యాటర్ తిలక్ వర్మ (75బి) అజేయ అర్ధ శతకంతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించగా, బౌలింగ్‌లో శార్దూల్ ఠాకూర్ నాలుగు వికెట్లతో సత్తా చాటాడు.
టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న ముంబై ముందు పంజాబ్ 201 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. పంజాబ్ ఇన్నింగ్స్‌లో ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్ (32 బంతుల్లో 57) హాఫ్ సెంచరీతో మెరవగా, చివర్లో అజ్మతుల్లా ఒమర్జాయ్ (17 బంతుల్లో 38) మెరుపు ఇన్నింగ్స్‌తో స్కోరును 200కు చేర్చాడు. ముంబై బౌలర్లలో శార్దూల్ ఠాకూర్ 39 పరుగులిచ్చి 4 కీలక వికెట్లు పడగొట్టి పంజాబ్ జోరుకు అడ్డుకట్ట వేశాడు.
భారీ లక్ష్య ఛేదనలో ముంబైకి ఓపెనర్ రియాన్ రికిల్టన్ (23 బంతుల్లో 48) అదిరిపోయే ఆరంభాన్నిచ్చాడు. మధ్యలో స్వల్ప వ్యవధిలో వికెట్లు కోల్పోయి ఒత్తిడిలో పడినప్పటికీ, క్రీజులోకి వచ్చిన తిలక్ వర్మ మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశాడు. కేవలం 33 బంతుల్లో 6 ఫోర్లు, 6 సిక్సర్లతో 75 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. అతనికి విల్ జాక్స్ (10 బంతుల్లో 25బి) చక్కటి సహకారం అందించడంతో ముంబై మరో బంతి మిగిలి ఉండగానే విజయాన్ని అందుకుంది.
టోర్నీ నుంచి ఇప్పటికే ఎలిమినేట్ అయిన ముంబై ఇండియన్స్ ఈ విజయంతో పంజాబ్ కింగ్స్ అవకాశాలను దెబ్బతీసింది. పంజాబ్ ప్రస్తుతం పాయింట్ల పట్టికలో నాలుగో స్థానంలో ఉన్నప్పటికీ, ఇతర మ్యాచ్ ల ఫలితాలు ఆ జట్టు అవకాశాలపై ప్రభావం చూపుతాయి.



# తిలక్ వర్మకు కెప్టెన్సీ పగ్గాలు

**- జట్టులో వైభవ సూర్యవంశీకి చోటు**
**- ముక్కోణపు సిరీస్‌కు భారత్-ఏ జట్టు ఎంపిక**

**ముంబయి :** తెలుగు తేజం, హైదరాబాదీ స్టార్ తిలక్ వర్మను భారత క్రికెట్ నాయకత్వ బృందంలో చేరాడు!. జూన్ 5 నుంచి శ్రీలంక వేదికగా జరుగనున్న ముక్కోణపు వన్డే సిరీస్‌కు భారత్–ఏ జట్టును బీసీసీఐ సీనియర్ సెలక్ష?న్ కమిటీ గురువారం ఎంపిక చేసింది. వైట్‌బాల్ ఫార్మాట్‌లో టీ20, వన్డేల్లో సీనియర్ జట్టు తరఫున రాణించిన తిలక్ వర్మను సెలక్ష?న్ కమిటీ భారత్–ఏ జట్టుకు కెప్టెన్‌గా ఎంపిక చేసింది. దీంతో భవిష్యత్‌లో భారత జట్టు నాయకత్వ బాధ్యతలకు తిలక్ వర్మకు ఇది తొలి పరీక్ష?గా నిలువనుంది.

ఇక యువ సంచలనం, 15 ఏండ్ల బుడతడు వైభవ్ సూర్యవంశీ తొలిసారి సీనియర్ క్రికెట్‌లోకి అడుగుపెట్టాడు. రెండేండ్లుగా ఐపీఎల్‌లో, ఈ ఏడాది అండర్–19 ప్రపంచకప్‌లో సత్తా చాటిన వైభవ్ సూర్యవంశీ భారత్–ఏ తరఫున బరిలోకి దిగనున్నాడు. పంజాబ్ కింగ్స్ తరఫున గొప్పగా రాణిస్తున్న ఓపెనింగ్ ద్వయం ప్రియాన్ష్ ఆర్య, ప్రభుసిమ్రన్ సింగ్‌లు సైతం జట్టులోకి ఎంపికయ్యారు.


## ముక్కోణపు సిరీస్‌కు బారత్–ఏ జట్టు

తిలక్ వర్మ (కెప్టెన్), ప్రియాన్ష్ ఆర్య, వైభవ్ సూర్యవంశీ, రియాన్ పరాగ్ (వైస్ కెప్టెన్), ఆయుశ్ బదొని, నిశాంత్ సింధు, హర్ష్ దూబె, సూర్యాన్ష్ షెడ్గె, ప్రభుసిమ్రన్ సింగ్ (వికెట్ కీపర్), కుమార్ కుశాగ్ర (వికెట్ కీపర్), విప్‌రాజ్ నిగమ్, యశ్ ఠాకూర్, యుధ్‌వీర్ సింగ్, అన్షుల్ కాంబోజ్, అర్షద్ ఖాన్.ల్స్ మాజీ వరల్డ్ నం.1 కిదాంబి శ్రీకాంత్ పోరాటానికి ప్రీ క్వార్టర్‌ఫైనల్లోనే తెరపడింది. 70 నిమిషాల ఉత్కంఠ పోరులో 16–21, 21–1, 18–21తో చైనీస్ తైపీ షట్లర్ చేతిలో కిదాంబి శ్రీకాంత్ పోరాడి ఓడాడు. మహిళల సింగిల్స్‌లో దేవిక 21–23, 11–21తో థాయ్‌లాండ్ షట్లర్ పిచమాన్ చేతిలో పోరాడి ఓటమిపాలైంది.

# ఏపీలో ట్రాన్స్‌జెండర్ సంక్షేమ బోర్డు ఏర్పాటు

**- రాయలసీమ ప్రతినిధిగా తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్**

**- అమరావతిలో తొలి సమావేశం**



**తిరుపతి కలెక్టరేట్ -ఆంధ్రనాడు, మే 14 :** ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ట్రాన్స్‌జెండర్ సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసింది. అమరావతిలోని ఏపీ సెక్రటేరియట్‌లో మంత్రి దోలా వీరాంజనేయ స్వామి అధ్యక్షతన గురువారం నిర్వహించిన తొలి సమావేశంలో తిరుపతి జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ వర్చువల్ విధానంలో పాల్గొన్నారు. ట్రాన్స్‌జెండర్ పర్సన్స్ (ప్రొటెక్షన్ ఆఫ్ రైట్స్) యాక్ట్-2019, రూల్స్-2020 ప్రకారం జారీ చేసిన జీఓ ఎంఎస్ నెం.14, తేదీ 12-05-2026 మేరకు ఈ బోర్డును ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇందులో రాయలసీమ ప్రాంత ప్రతినిధిగా తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌కు సభ్యత్వం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. బోర్డు ఛైర్‌పర్సన్‌గా మంత్రి దోలా వీరాంజనేయ స్వామి, మెంబర్ సెక్రటరీగా మహిళలు, శిశువులు, విభిన్న ప్రభావంతులు ఒ వయోవృద్ధుల సంక్షేమ శాఖ కార్యదర్శి ఎ.సూర్యకుమారి వ్యవహరించనున్నారు. విశాఖపట్నం జిల్లా కలెక్టర్‌ను ఆంధ్ర ప్రాంత ప్రతినిధిగా నియమించగా, ట్రాన్స్‌జెండర్ ప్రతినిధులుగా కోట ప్రేమ్ సాగర్ రాయ్, నక్కా జీవన్ కుమారి, బోను దుర్గలను సభ్యులుగా నియమించారు. ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సంక్షేమానికి సంబంధించిన పథకాల రూపకల్పన, అమలు, సమస్యల పరిష్కారం, వివిధ శాఖల మధ్య సమన్వయం వంటి అంశాల్లో ఈ బోర్డు ప్రభుత్వానికి సలహాలు అందించనుంది.

# బజాజ్ ఫైనాన్స్‌లో 86 మంది యువతకు ఉద్యోగాలు

**- స్వర్ణ గ్రామం -స్వర్ణ వార్డు ఆధ్వర్యంలో తిరుపతిలో ఇంటర్వ్యూలు**






**తిరుపతి కలెక్టరేట్ -ఆంధ్రనాడు, మే 14:** స్వర్ణ గ్రామం-స్వర్ణ వార్డు శాఖ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో నిర్వహించిన నియామక ప్రక్రియలో భాగంగా బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్ సంస్థలో సేల్స్ ఆఫీసర్ పోస్టుల కోసం ఇంటర్వ్యూలు విజయవంతంగా నిర్వహించారు. తిరుపతి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో మే 13, 14 తేదీల్లో నిర్వహించిన ఈ ఇంటర్వ్యూలకు తిరుపతి, చిత్తూరు, వైఎస్సార్ కడప, అన్నమయ్య, నెల్లూరు, శ్రీ సత్యసాయి జిల్లాలకు చెందిన 102 మంది అభ్యర్థులు హాజరయ్యారు. స్వర్ణ గ్రామం--స్వర్ణ వార్డుల ద్వారా కౌశలం ఆన్‌లైన్ పరీక్షల్లో అర్హత సాధించిన వారిని ఇంటర్వ్యూలకు ఎంపిక చేశారు. ఇంటర్వ్యూల అనంతరం 86 మంది అభ్యర్థులను ఎంపిక చేసినట్లు బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్ హెచ్ఆర్ ప్రతినిధులు తెలిపారు. ఎంపికైన వారికి త్వరలో నియామక ప్రక్రియ పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్వర్ణ గ్రామం--స్వర్ణ వార్డు అధికారి బి. గంగా భవాని, జిల్లా కో-ఆర్డినేటర్ పి.వి. జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

# వడ్డెర సంఘాలకు గనుల లీజుల్లో ప్రాధాన్యత

**తిరుపతి కలెక్టరేట్ -ఆంధ్రనాడు, మే 14:** వడ్డేర సమాజ ఆర్థికాభివృద్ధి, ఉపాధి అవకాశాల విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గనుల లీజుల కేటాయింపులో వడ్డేర సహకార సంఘాలకు ప్రత్యేక ప్రాధాన్యత కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జీ.ఓ.ఎం.ఎస్. నం.92 ద్వారా 100 హెక్టార్ల విస్తీర్ణంలో ప్రత్యేక క్వారీ పూల్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తిరుపతి జిల్లా గనులు, భూగర్భ శాఖ అధికారి ఎం. బాలాజీ నాయక్ తెలిపారు. రోడ్ మెటల్, బిల్డింగ్ స్టోన్, గ్రావెల్, స్లేట్, రాళ్ల కటింగ్ వంటి సంప్రదాయ వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వడ్డేర సమాజ అభ్యున్నతిని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. నమోదైన వడ్డేర సహకార సంఘాలకు గనుల లీజుల కేటాయింపులో ప్రీమియం, సీనరేజ్ ఫీజులపై 50 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఒక్కో సంఘానికి గరిష్టంగా నాలుగు హెక్టార్ల వరకు లీజులు మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. గ్రామ, మండల స్థాయి ప్రాధాన్యత ఆధారంగా ముందుగా దరఖాస్తు చేసిన సంఘాలకు తొలి అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. అలాగే వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, సహకార, ఎంఎస్ఎంఈ, గనులు-భూగర్భ శాఖల సమన్వయంతో కొత్త వడ్డేర సహకార సంఘాల ఏర్పాటు, శిక్షణ, రుణాలు, ఆర్థిక సహాయం అందించనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

# నాగలాపురంలో జలధార-జలహారతికి ఊపు

**- రూ.1.57 కోట్లతో 68 నీటి సంరక్షణ పనులు**

**- 3,612 ఎకరాలకు సాగునీటి లబ్ధి..**

**గ్రామాల్లో పెరుగుతున్న భూగర్భ జలాలు**



**తిరుపతి కలెక్టరేట్ -ఆంధ్రనాడు, మే 14:** తిరుపతి జిల్లా నాగలాపురం మండలంలో జలధార--జలహారతి కార్యక్రమం కింద చేపడుతున్న నీటి సంరక్షణ పనులు గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు సాగునీటి భరోసాను కల్పిస్తున్నాయి. రూ.1.57 కోట్ల అంచనా వ్యయంతో 68 పనులకు పరిపాలనా అనుమతులు జారీ కాగా, ఈ పనుల ద్వారా మండలంలోని సుమారు 3,612 ఎకరాలకు సాగునీటి లబ్ధి కలగనుంది. వెంబాకం, కొట్టాకాడు, నాగలాపురం, రాజులకండ్రిగ, సదాశివ శంకరాపురం పంచాయితీల రైతులు ప్రధానంగా ప్రయోజనం పొందనున్నారు. కార్యక్రమం కింద 26 ఫీడర్ కాలువల పునరుద్ధరణ, 20 ఫీల్డ్ కాలువల మరమ్మతులు, 6 చెక్‌డ్యాంలలో పూడికతీత, 5 చెరువుల పూడికతీత, 5 కందిత కందకాల నిర్మాణం, 6 నీటి కుంటల పూడికతీత పనులు చేపడుతున్నారు. వర్షపు నీటిని నిల్వ చేసి భూగర్భ జలాలను పెంచే లక్ష్యంతో ఈ పనులు కొనసాగుతున్నాయి.

**రాజులకండ్రిగలో కాలువల పూడికతీత**

రాజులకండ్రిగ గ్రామ పంచాయితీలో ఉపాధి హామీ పథకం కింద కాలువల పూడికతీత పనులు కొనసాగుతున్నాయి. రూ.5.17 లక్షల వ్యయంతో వంక నుంచి రాజులకండ్రిగ చెరువు వరకు, అలాగే అల్లపగుంట మిట్ట నుంచి వజ్జవారికండ్రిగ చెరువు వరకు కాలువల అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ఈ పనుల వల్ల అటవీ ప్రాంతాల నుంచి వచ్చే వర్షపు నీరు చెరువులకు చేరి సాగునీటి లభ్యత పెరుగుతుందని అధికారులు తెలిపారు. ఈ కాలువల ద్వారా రాజులకండ్రిగ, జానికాపురం, అనామతు కండ్రిగ, వజ్జవారికండ్రిగ ప్రాంతాల్లో సాగు చేస్తున్న వేరుశనగ, వరి, మామిడి పంటలకు ప్రయోజనం చేకూరనుంది. చెరువు పరిధిలోని 250 ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు 35 బోర్లు, 10 బావుల్లో భూగర్భ జలాలు పెరిగే అవకాశముందని స్థానికులు పేర్కొంటున్నారు.





గ్రామాల్లోనే ఉపాధి అవకాశాలు ఉపాధి హామీ వేతనదారుడు మాధవరాజు మాట్లాడుతూ.. కాలువల పునరుద్ధరణతో రైతులకు సాగునీటి సమస్య తగ్గుతుందని తెలిపారు. వేతనదారురాలు దివ్య మాట్లాడుతూ వేసవి కాలంలో గ్రామాల్లోనే ఉపాధి లభించడం వల్ల వలసలు తగ్గాయని, రోజుకు రూ.307 వరకు వేతనం అందుతోందని చెప్పారు. జలధార--జలహారతి పనులు గ్రామీణ ప్రాంతాల్లో నీటి సంరక్షణతో పాటు ఉపాధి అవకాశాలను కల్పిస్తూ రైతులకు మేలు చేస్తున్నాయని అధికారులు వెల్లడించారు.




Printed, Published Edited and Owned by M.HARIBABU, Printed at AKSHARA PRINTERS, 1st Floor, SSS Complex, Air Bypass Road, Tirupati Town, Tirupati District, A.P.,
Published at AKSHARA PUBLICATIONS, Tirupati, Editor : M.Hari Babu , Cell : 9490400684, RNI: 2009/28733